సాక్షి 24|7
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం 23-8-2017



కోటీశ్వరుడికి రూ.కోటి డీకేటీ పట్టా

ప్రభుత్వస్థలం అంటూ 1592 సర్వేనంబర్‌లో సూచికబోర్డు

10లో

సిలబస్‌పై సమ్మేటివ్!

ప్రాథమిక పాఠశాలలు : 2501
విద్యార్థుల సంఖ్య: 92,383

ప్రాథమికోన్నత పాఠశాలలు 290
విద్యార్థుల 19,359

ఉన్నత పాఠశాలలు: 303
విద్యార్థుల సంఖ్య: 68,161

అన్ని పాఠశాలల్లో కలిపి విద్యార్థుల సంఖ్య: 1,79,903

ఇప్పటివరకు పూర్తయిన సిలబస్: 15 శాతమే

సమ్మేటివ్ పరీక్షలు ప్రారంభం : సెప్టెంబర్ 11 నుంచి



తిలక్‌నగర్‌లోని పాఠశాలలో పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పాఠశాల స్థాయిలో చూస్తేనేమో సిలబస్ పూర్తికాలేదు. మరి ప్రభుత్వమేమో సమ్మేటివ్ పరీక్షలంటుంది. ఇటు సిలబస్ పూర్తికాక, అటు తరగతులు జరగక రెండింటి మధ్య విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటప్పుడు విద్యార్థులు పరీక్షలను ఎలా రాస్తారో ఏమో అధికారులకే తెలియాల్సి ఉంది. నిబంధనల ప్రకారం పాఠశాల తెరిచిన రెండున్నర, మూడు నెలల తర్వాత సమ్మేటివ్ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. కానీ ఆ సమయంలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియతోనే సమయం గడిచిపోయింది. మరి సమ్మేటివ్ పరీక్షలను విద్యార్థులు ఎలారాస్తేరో వారికే ఎరుక సుమా. పరీక్షలంటే ఉపాధ్యాయులు సైతం ఆందోళన చెందడం ఇక్కడ కొసమెరుపు.

2లో

అధర్మాసుపత్రి 1



మేమింతే..!

ఉదయం 10 గంటలైనా ఓపీకి రాని వైద్యుడు

ప్రొద్దుటూరు ఆసుపత్రిలో అధర్మం రాజ్యమేలుతోంది. సమయపాలన పాటించకుండా వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆస్పత్రిలో నిర్వహించే పరీక్షల్లో తప్పులు దొర్లుతున్నాయి. చిన్న చిన్న కారణాలకే కేసులను రిమ్స్‌కు పంపుతున్నారు. అవసరం లేకున్నా స్కానింగ్, ఇతర పరీక్షల కోసం రోగులను బయటికి పంపిస్తున్నారు. ఆస్పత్రిలో తరచూ మందుల కొరత ఉండటంతో రోగులు ప్రైవేట్ మెడికల్ షాపులకు వెళ్లాల్సి వస్తోంది. ఆస్పత్రిలో అంబులెన్సులు ఉన్నా కమీషన్ల కోసం కొందరు సిబ్బంది ప్రైవేట్ అంబులెన్స్‌లను పిలిపిస్తున్నారు. ఆస్పత్రిలో కాన్పుకు రావాలంటే పేదలు భయపడే పరిస్థితి ఉంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఆస్పత్రిలో నెలకొన్న నిర్లక్ష్యంపై 'సాక్షి' వరుస కథనాల ఫోకస్. సమయపాలన లేమిపై ప్రత్యేక కథనం..

2లో

మట్టి బొక్కేందుకు నీటిని ఆపారు


కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న రైతు నాయకులు

- ఐదు వేల ఎకరాలకు దెబ్బ
- గణపయ్య నిమజ్జనానికీ నీటి కరువు
- కలెక్టర్‌కూ తప్పుడు సమాచారం
- నీటి సంఘ నాయకులు, అధికారుల తీరుపై భగ్గుమన్న ఆయకట్టు రైతులు

కడప సెవెన్‌రోడ్స్ : పాతకడప చెరువులో మట్టి అమ్ముకుని జేబులు నింపుకోవడానికి ఏకంగా చెరువుకే నీరు రాకుండా కొందరు అడ్డుపడ్డారు. నామినేటెడ్ నీటిసంఘ నాయకుల బరితెగింపునకు కేసీ కెనాల్ అధికారులు వత్తాసుగా నిలిచారు. ఫలితంగా 5వేల ఎకరాలకు సాగునీరు అందక వెలవెల పోతోంది. నిమజ్జనానికి సైతం నీరు లేకుండాపోయింది. తమ దోపిడీని కప్పి పుచ్చుకునేందుకు సాక్షాత్తు కలెక్టర్‌కు సైతం తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పాతకడప చెరువు ఆయకట్టు రైతులు భగ్గుమన్నారు. మంగళవారం కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.చంద్ర, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ చైతన్యల నాయకత్వంలో రైతులు స్థానిక పసలవాండ్లపల్లెకు చేరుకున్నారు. కేసీకాలువ నీటికి అవరోధంగా ఆర్‌అండ్‌బీ అధికారులు చేపడుతున్న నిర్మాణాల వద్దకు చేరుకున్నారు. చెరువుకు నీరు మళ్లించేందుకు వీలుగా అక్కడున్న అడ్డంకులను తొలగించారు. కేసీ కెనాల్ కింద జిల్లాలో లక్ష ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతి యేటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. అయితే చివరి ఆయకట్టు ప్రాంతమైన పాతకడప చెరువుకు కుందూనది నుంచి నీటిని తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. ఈ యేడు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల జూన్ మూడవ వారం నుంచే కుందూలో ఒక నెలరోజులపాటు నీరు ప్రవహించింది. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి నీరు కిందికి వృథాగా పోవడం కంటే పాతకడప చెరువుకు మళ్లించాలని రైతు నాయకుడు దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి కలెక్టర్ బాబూరావునాయుడును కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్ అప్పటికప్పుడు తుంగభద్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీరు వరదరాజులుతో మాట్లాడారు.

కుందూ నీటిని పాత కడప చెరువుకు మళ్లించేందుకు చర్యలు తీసుకునే విధంగా కేసీ కెనాల్ అధికారులతో మాట్లాడాలని ఆదేశించారు.

పూడిక పనులు జరుగుతున్నాయి..

అయితే నామినేటెడ్ నీటి సంఘ నాయకులు, కేసీకెనాల్ అధికారులు కూడబల్కుకుని కలెక్టర్‌ను సైతం తప్పుదారి పట్టించారు. చెరువుకు నీటిని అందించే కాలువలో పూడిక పనులు జరగాలని, పైగా కుందూలో వస్తున్న నీరు శ్రీశైలం లేదా తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే వాటా నీరు కాదని కలెక్టర్‌కు చెప్పారు. ఏప్రిల్, మే మాసాల్లోనే కాలువల్లో సిల్టింగ్ పనులు, మరమ్మతులు జరిపి ఉంటే సకాలంలో కుందూ నీటిని చెరువుకు మళ్లించేందుకు అవకాశం ఉండేది. అయితే నీటి సంఘ నాయకులు చెరువులో మట్టి అమ్ముకుని సొమ్ము చేసుకోవడం కోసం పూడికతీత, మరమ్మతు పనులను ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేశారు. ఇటీవల నంద్యాల ప్రాంతంలో కురిసిన వర్షాలకు పది రోజులుగా కుందూలో నీరు ప్రవహిస్తోంది. ఈ నీటిని తాగు అవసరాల కోసమని లింగంపల్లెకు మళ్లించారు. ఈనెల 25వ తేదీన వినాయక చవితి పర్వదినం ఉంది. ఆదివారం విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. నగరంలో వందల సంఖ్యలోనే విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. వీటిని నిమజ్జనం చేసేందుకు కడప చుట్టుపక్కల ఎక్కడా చుక్క నీరు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కనీసం ఇప్పటికైనా కుందూ నీటిని పాత కడప చెరువుకు మళ్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీతో లాలూచీ పడాల్సిన అవసరం లేదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీకి టీడీపీతో లాలూచీ పడాల్సిన అవసరం లేదని డీసీసీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి నంద్యాల ఎన్నికలో పోటీ చేయలేదని, అక్కడ ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం తగదన్నారు. మతతత్వ పార్టీ బీజేపీకి మద్దతు ఇచ్చిన టీడీపీ మైనార్టీలను, దళితులను నిలువునా మోసం చేసిందన్నారు. దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం ముస్లింలకు, దళితులకు రక్షణ కల్పించింది ఒక్క కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కార్యక్రమంలో పీసీసీ జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, అధికార ప్రతినిధి సుంకేసుల బాదుల్లా, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

సిలబస్‌పై సమ్మెటివ్!

- సజావుగా సమ్మెటివ్ పరీక్షలు జరిగేనా?
- సకాలంలో సిలబస్ పూర్తికావడం కష్టమే
- ఆందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- సెప్టెంబర్ 11 నుంచి ప్రారంభం కానున్న సమ్మెటివ్ పరీక్షలు
- సిలబస్ పూర్తయిన మేరకే ప్రశ్నాపత్రాలను తయారుచేయాలి
- ఉపాధ్యాయ సంఘాల వినతి

కడప ఎడ్యుకేషన్ :

అటు విద్యార్థుల్లోనూ, ఇటు ఉపాధ్యాయుల్లోనూ సమ్మెటివ్ పరీక్షల టెన్షన్ ఎక్కువైంది. మరో 20 రోజుల్లో పరీక్షలు ఉండటంతో సిలబస్‌పై భయం మొదలైంది. పరీక్షల నాటికి ఎట్లాగైనా సిలబస్ పూర్తిచేయాలని అధికారులు వెంటపడుతుండటంతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. వరుస పండగలు, సెలవుల నేపథ్యంలో బోధన కదలని పరిస్థితి. సిలబస్ లక్ష్యం పూర్తిపై ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బోధన గాడితప్పడానికి బదిలీలే కారణమని సంఘాలు ఆరోపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. పాఠశాలలు ప్రారంభమైన జూన్ నెల నుంచి ఆగస్టు 10వ తేదీ వరకూ ఉపాధ్యాయులు బదిలీల గొడవల్లో మునిగి తేలారు. బదిలీల కోసం దరఖాస్తులు ఎలా చేసుకోవాలి, ఎవరెవరికి ఏ పాఠశాల వస్తుంది, ఏ పాఠశాల అయితే బాగుంటుంది ఇలా తర్జనభర్జనలో అయ్యవార్లు బిజిబిజీగా గడిపారు. దీంతో జూన్ 12 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకూ జరిగిన అయ్యవార్ల బదిలీల గొడవలో విద్యార్థుల చదువులు అటకెక్కాయి. బదిలీల ప్రక్రియలో భాగంగా వరుసగా స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు, ఎల్‌పీలు, ఎస్‌జీటీల స్థానచలనాలు మొత్తం ఈనెల 10వ తేదీ వరకు సాగాయి.

వరుసగా సెలవులు

మొదటగా ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఆగస్టు 1వ తేదీన వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరిపోయారు. ఆతర్వాత ఎస్‌జీటీలు మిగతా ఉపాధ్యాయులు ఆగస్టు 11న తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరిపోయారు. తీరా విధుల్లో చేరిన వారం పదిరోజులకే మళ్లీ నాలుగు రోజులపాటు పాఠశాలలకు సెలవులు వచ్చాయి. తర్వాత తిరిగి పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు నాలుగు రోజులు పాఠాలు చెప్పాగానే మళ్లీ ఆదివారం వచ్చింది. తిరిగి 21, 22 తేదీలలో ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్సు పేరుతో రెండు రోజులు కాలాన్ని హరించేశారు. బోధనపై దృష్టిసారించేలోపు మళ్లీ శుక్రవారం రోజు వినాయక చవితి శనివారం అదివారం ఇలా రోజులన్నీ సెలవులతో ముగిసిపోనున్నాయి. మరేమో ఇచ్చేనెల 11వ తేదీ నుంచి 1 నుంచి 9వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు సమ్మెటివ్ పరీక్షల నిర్వాహణ ప్రభుత్వం తేదీని ప్రకటించింది. సిలబస్ చూస్తే పదిశాతం కూడా పూర్తి కాని పరిస్థితి. బోధన అంతంతమాత్రమే. సమ్మెటివ్ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే ఈ 20 రోజులు సెలవులు లేకుండా బోధన సాగితేనే కొంతైనా విద్యార్థులు పరీక్షలు రాయగలరు. మరి ఉపాధ్యాయులు అంత బాధ్యతగా సిలబస్ పూర్తి చేస్తారా.. అనేది అనుమానామే. మరి అధికారులు ఏం చేస్తారో వేచిచూడాల్సిందే. కాగా పూర్తయినంత సిలబస్ మేరకే సమ్మెటివ్ ప్రశ్నపత్రాలను ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

జిల్లాలో ఇంకా కొన్ని పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఇందులోభాగంగా హిందీకి సంబంధించి 28 మంది, తెలుగుకు 44 మంది, సోషల్‌కు 35 మంది, గణితానికి 15మంది, ఫిజికల్ సైన్సుకు ఐదుగురు, బయలాజికి 15 మంది చొప్పున ఉపాధ్యాయుల కొరత ఉంది.

సిలబస్ పూర్తయ్యేదానికి చర్యలు తీసుకుంటాం



చాలా స్కూల్స్‌లో దాదాపు సిలబస్ పూర్తయింది. సిలబస్ పూర్తికాని పాఠశాలల గురించి డిప్యూటీడీఈఓలు, ఎంఈఓల ద్వారా ప్రతి పాఠశాలను పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుంటాం. పరీక్షలు ప్రారంభమయ్యేటానికి అన్ని పాఠశాలల్లో ఖచ్చితంగా సిలబస్ పూర్తి చేసి పరీక్షలను నిర్వహిస్తాం. **- పొన్నతోట శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి**

సిలబస్‌కు అనుగుణంగా ప్రశ్నపత్రం



ప్రస్తుతం జరిగిన సిలబస్‌కు అనుగుణంగా ప్రశ్నాపత్రాలను సిద్ధం చేసి పరీక్షలను నిర్వహించాలి. సాధారణంగా ఇప్పటివరకూ ఎంత సిలబస్ జరగాల్సి ఉందో అంతవరకూ ప్రశ్నాపత్రం సిద్ధం చేస్తే విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. అధికారులు సంబంధిత సమస్యను దృష్టిలో ఉంచుకుని పశ్నపత్రం తయారుచేయాలి

- శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

వేసవిలోనే బదిలీల ప్రక్రియ ముగించి ఉంటే బాగుండేది



ఉపాధ్యాయుల బదిలీలను వేసవి సెలవుల్లోనే ముగించి ఉంటే బాగుండేది. తీరా పాఠశాలల ప్రారంభమయ్యాక బదిలీల ప్రక్రియను ప్రారంభించడం వల్ల అన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సిలబస్ పూర్తికాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- మోపూరి వెంకట శివారెడ్డి, పీఆర్‌టీయూ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వానికి సమస్యలు పట్టడం లేదు:



పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. ఉపాధ్యాయ బదిలీల్లో కూడా రోజుకో నిబంధనలతో ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేశారు. ఇప్పుడేమో సమ్మెటివ్ పరీక్షలను నిర్వహించాలంటున్నారు. సిలబస్ ఏమో పూర్తికాలేదు. మరి పరీక్షలను ఎలా నిర్వహిస్తారు. **- రమణారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు**

మేమింతే..!


క్యూలో నీల్చోలేక కూర్చున్న వృద్ధులు


పని చేయని బయోమెట్రిక్ యంత్రం

- 10కి వస్తాం.. 12కు వెళ్తాం
- వైద్యుల కోసం రోగుల ఎదురుచూపులు
- పనిచేయని బయోమెట్రిక్ మిషన్
- మారని జిల్లా ఆస్పత్రి వైద్యుల తీరు

ప్రొద్దుటూరు క్రైం: నిత్యం వందలమంది ప్రజలు వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి వస్తుంటారు.. డాక్టర్‌కు చూపించుకొని త్వరగా ఇంటికి వెళ్దామనుకొని దూర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది ఉదయాన్నే ఆస్పత్రికి వస్తారు.. పాపం కొందరు రోగులు ఉదయం 8.30, 9గంటల నుంచే ఆస్పత్రి ఓపీ వద్ద పడిగాపులు కాస్తుంటారు. వైద్యులు ఆలస్యంగా విధులకు వస్తుండటంతో ఆస్పత్రిలోనే వారికి మధ్యాహ్నం అవుతోంది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ఆందోళన చెందుతున్నారు.

ఈ డాక్టర్లు ఇంతే..

ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి స్థానికంగా ఉన్నవారే గాక చుట్టు పక్కల మండలాల నుంచి వైద్యం కోసం వస్తుంటారు. ఇటీవల ఆస్పత్రిలో సీటిస్కానింగ్, డయాలసిస్ విభాగం ఉండటంతో ఓపీ సంఖ్య గతంలో కంటే బాగా పెరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఓపీ నిర్వహించాల్సి ఉంది. తర్వాత 2గంటల వరకు అత్యవసర విభాగం, వార్డులను సందర్శించాలి. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం తిరిగి వార్డుల్లో ఉన్న ఇన్‌పేషంట్లను పరిశీలించి 4 గంటల వరకు డాక్టర్లు ఆస్పత్రిలోనే అందుబాటులో ఉండాలి. డాక్టర్లు ఉదయమే వస్తారనే ఉద్దేశంతో దూరప్రాంతాలకు చెందిన మహిళలు, వృద్ధులు ఉదయాన్నే ఆస్పత్రికి వస్తారు. జిల్లా ఆస్పత్రిలో ఐదుగురు సవిల్ సర్జన్‌లు, 12మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు పనిచేస్తున్నారు. వీరిలో దాదాపు సగం మందికి బయట ప్రైవేట్ క్లినిక్‌లు ఉన్నాయి. దీంతో ఉదయం ఓపీకి రావడం ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఉన్నతాధికారులు ఎన్నో సార్లు హెచ్చరించినా వారిలో మార్పు రాలేదు. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రం కొన్నిరోజులు సమయపాలన పాటిస్తారు. తర్వాత పరిస్థితి షరామామూలే. కొందరు వైద్యులు ఉదయం 9.30కు రాగా మరి కొందరు 9.45 గంటలకు వస్తున్నారు. మిగతా వారందరూ 10 గంటల తర్వాతనే ఆస్పత్రికి వస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. ఓపీ విభాగాల్లో 12 గంటల తర్వాత డాక్టర్లు ఉండటం లేదని రోగులు వాపోతున్నారు. వీరిలో చాలా మంది డాక్టర్లు మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లి తిరిగి ఆస్పత్రికి రావడం లేదని రోగులు వాపోతున్నారు. డాక్టర్లు ఆలస్యంగా వస్తుండటంతో కొందరు వృద్ధులు క్యూలో నిల్చోలేక అవస్థలు పడుతున్నారు.

బయోమెట్రిక్ ఉంది.. కానీ పని చేయదు

జిల్లా ఆస్పత్రిలో నాలుగేళ్ల క్రితమే బయోమెట్రిక్ విధానం అమల్లోకి తెచ్చారు. అయితే ఏ రోజు పట్టుమని పదిరోజులు కూడా మిషన్ పనిచేయలేదు. ఆస్పత్రికి ఉదయం 9 గంటలలోపు వచ్చి బయోమెట్రిక్ యంత్రంలో వేలిముద్ర ద్వారా హాజరు వేసుకోవాలి. ఇళ్లకు వెళ్లేటప్పుడు కూడా బయోమెట్రిక్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మిషన్ ఉంటే 9 గంటల లోపు ఆస్పత్రికి రావాల్సి ఉంటుందనే కారణంతో కొందరు కావాలనే చెడగొడుతున్నారని కొందరు సిబ్బంది చెబుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సులు, సెక్యూరిటీ, ఏఎన్ఎంలు, ల్యాబ్ సిబ్బందితో కొన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రం షిఫ్ట్‌లవారీగా నిర్ణీత సమయానికి విధులకు హాజరు అవుతున్నారు. కానీ కొందరు వైద్యులు, కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు మాత్రం సమయ పాలన పాటించడం లేదని సిబ్బందే చెబుతున్నారు. బయోమెట్రిక్ మిషన్ పనిచేస్తే వైద్యులు, ఉద్యోగుల వ్యవహారం గాడిలోకి వచ్చే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మధ్యాహ్నం 12గంటలకే మూసిన మెడికల్ స్త్రీల ఓపీ విభాగం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన వెంకటరమణ

చింతకొమ్మదిన్నె (కడప వైఎస్సార్ సర్కిల్): నగర శివార్లలోని కమలాపురం బైపాస్ రోడ్డులోని నరసరామయ్య గారి పల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చింతకొమ్మదిన్నె ఎస్ఐ హేమకుమార్ కథనం మేరకు.. బోడెద్దుల పల్లె గ్రామానికి చెందిన నర్రాగురి వెంకటరమణ (45) అనే వ్యక్తి తన సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై కమలాపురానికి వెళ్లి తిరిగి రింగురోడ్డు మీదుగా ఇంటికి బయలుదేరాడు. నరసరామయ్యగారిపల్లె సమీపంలోని రైల్వే బ్రిడ్డి దిగువకు రాగానే అటుగా వెళ్తున్న టీఎన్ 7 ఓటీ 6330 నెంబరు గల లారీని క్రాస్ చేసేందుకు ప్రయత్నించగా అదుపు తప్పి వెనుక వైపున లారీని ఢీకొన్నాడు. దీంతో వెంకటరమణ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని..

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని ఎస్. సోమవరం గ్రామం దిగువ నల్లగుట్టపల్లెకు చెందిన ఆదినారాయణ సొంత పనుల నిమిత్తం గుట్టపల్లెకు వెళ్లారు. గుట్టపల్లె బస్ స్టాపు వద్ద చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారి దాటుతుండగా రాయచోటి వైపునుంచి కలకడ వైపు వెళుతున్న ద్విచక్రవాహనం ఆదినారాయణను ఢీ కొనడంతో ఆదినారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆదినారాయణతో పాటు ద్విచక్ర వాహనంలో వెళుతున్న మధుకుమార్, ఉపేంద్రకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల సహాయంతో గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సయ్యద్‌హాషం తెలిపారు.

అటవీశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్య


గోవర్ధన్ (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు బాలపల్లి రేంజ్‌లో కాంట్రాక్టు పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ముత్తరాసి గోవర్దన్ (32) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య సరస్వతి, 6 సంవత్సరాల కుమారుడు వెంకటకళ్యాణ్ ఉన్నారు. జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన గోవర్దన్‌కు 11 ఏళ్ల క్రితం సరస్వతితో వివాహమైంది. ఉద్యోగ రీత్యా రైల్వేకోడూరు ఉంగరాలనగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్య స్థానిక ప్రైవేటు పాఠశాలలో పని చేస్తోంది. అయితే గోవర్దన్ విధులకు సరిగా హాజరు కాకుండా మద్యం తాగి ఇంట్లో గొడవ పడుతూ ఉండేవాడని స్థానికుల ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలో ఇంట్లోనే ఉరివేసుకుని మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని సీఐ సాయినాథ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు చట్టాలపై

అవగాహన అవసరం

లీగల్ (కడప అర్బన్) :



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి యూయూ ప్రసాద్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ యూయూ ప్రసాద్

మహిళలు ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి యూయూ ప్రసాద్ అన్నారు. మంగళవారం నగర శివార్లలోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో రైట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని మత పెద్దలు, మండల సమాఖ్య మహిళా లీడర్లతో ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, మాధ్యమిక విద్యను బాలికలకు ప్రోత్సహించడం, వృత్తి విద్య నైపుణ్య కోర్సులను మహిళలు, బాలికలు నేర్చుకునేందుకు కృషి చేయాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల వారు అనుకుంటే సాంఘిక దురాచారాలను రూపుమాపగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం ఇన్‌చార్జి దివ్యవాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి శివప్రసాద్‌రెడ్డి, డీఆర్‌డీఏ ఏపీడీ నాగరాజు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి లలితాబాయి, రామకృష్ణ మఠం స్వామిజీ దివ్యానందం, సీఎస్ఐ ఫాస్టర్ స్వరూప్, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితురాలు అరెస్ట్


నిందితురాలితో సీఐ, ఎస్ఐ, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక మోడంపల్లెలో ఓ ఇంట్లో జరిగిన చోరీకి సంబంధించి మల్లేల అఫ్సర్ అనే నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. అర్బన్ సీఐ సదాశివయ్య, ఎస్ఐ మధుమల్లేశ్వరరెడ్డిలు అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఓబుళమ్మ అనే మహిళ ఈ నెల 19న ఉదయం పశువులకు పచ్చిగడ్డి కోసుకొని రావడం కోసం ఇంటికి తాళం వేసి, తాళాన్ని పక్కనే ఉన్న కిటికిలో పెట్టి వెళ్లారు. అదే వీధిలో ఉన్న అఫ్సర్ అనే మహిళ కొన్ని రోజుల నుంచి వారి ఇంటికి పాల కోసం వచ్చేది. ఈ క్రమంలో ఓబుళమ్మ గడ్డి కోసం వెళ్లగానే ఆమె పాలకోసం వారి ఇంటికి వచ్చింది. కిటికిలో ఉన్న తాళాన్ని తీసి ఇంట్లో ఉన్న బంగారు నగలను తీసుకొని వెళ్లింది. అయితే మధ్యాహ్నం ఆమె ఇంటికి రాగానే ఎవరో మహిళ వచ్చి వెళ్లిందని పక్కింటి వారు చెప్పారు. దీంతో ఆమె కంగారుగా ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న బంగారు నగలు కనిపించలేదు. దీంతో ఆమె వెంటనే టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితురాలిని అరెస్టు చేసి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు ఎర్ర కూలీలు అరెస్ట్

రైల్వేకోడూరు : ఇద్దరు ఎర్రచందనం కూలీలను అరెస్టు చేసి వారి నుంచి 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు ఎఫ్ఆర్ఓ నయీం అలీ తెలిపారు. స్థానిక కార్యాలయలంలో మంగవారం ఆయన మాట్లాడుతూ తెల్లవారు జామున ఓబులవారిపల్లె మండల పరిధిలోని వై.కోట అటవీ ప్రాంతంలోని కంది రేవుల వద్ద 5 ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న రైల్వేకోడూరు మండలంలోని కన్నెగుంట ఎస్టీ కాలనీకి చెందిన నల్లి మల్లీశ్వరి, మేకల రమేష్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దుంగలు బరువు 159 కేజీలు ఉందని, ప్రభుత్వ విలువ రూ. 52. వేలు ఉంటుందన్నారు.

లారీని బైకు ఢీ కొని నలుగురికి గాయాలు

రాజంపేట : కడప–రేణిగుంట రహదారిలో పట్టణ శివార్లలోని భువనగిరిపల్లె సమీపంలో నిలబడిన లారీని బైకు ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రెడ్డిపల్లెకు చెందిన చలపతి అనే వ్యక్తి తన కుమార్తె రేష్మాను రాజంపేట పట్టణంలోని కళాశాలకు బైకుపై తీసుకొస్తూ.. మార్గమధ్యంలో మౌనిక, అనూష అనే ఇద్దరిని కూడా తన బైకులో ఎక్కించుకున్నాడు. బైకు అదుపుతప్పి లారీని ఢీ కొనడంతో చలపతి, రేష్మాకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.


గాయపడ్డ చలపతి


రేష్మా

మేడపై నుంచి పడి వివాహిత దుర్మరణం

- మంచం కిందికి దించుతుండగా
- 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతాని గురైన వైనం


మిద్దెపై నుంచి పడి మృతి చెందిన విమల


రాజంపేట : రాజంపేట పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆర్వోబీ సమీపంలో ఓ మేడపై నుంచి పడి విమల (28) అనే వివాహిత దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఏపీ ఎండీసీలో పనిచేస్తున్న రమేష్, విమల దంపతులు ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సరస్వతీపురానికి చెందిన విమల, రైల్వేకోడూరుకు చెందిన రమేష్‌లు రాజంపేట ఆర్వోబీ సమీపంలో ఉన్న ఇంటిలో పై అంతస్తులో నివసిస్తున్నారు. రాత్రి 7 గంటల సమయంలో విమల పై అంతస్తు నుంచి మంచాన్ని కింది అంతస్తులోకి దించేందుకు ప్రయత్నించింది. కింది అంతస్తులో మంచాన్ని అందుకునేందుకు వంశీ అనే యువకుడు ఉన్నాడు. ఆ సమయంలో ఇంటికి అత్యంత సమీపంలో ఉన్న 11 కేవీ తీగలకు ఇనుప మంచం తగలడంతో విద్యుత్ సరఫరా అయింది. వెంటనే ఆమె విద్యుదాఘాతానికి గురై పై అంతస్తు నుంచి కింద పడింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రాజగోపాల్ పరిశీలించి మృతురాలి సంబంధీకుల నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనలో వంశీ అనే యువకుడు కూడా స్వల్పంగా విద్యుదాఘాతానికి గురయ్యాడు.

విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ముప్పుపై సాక్షిలో కథనం..

రాజంపేట పట్టణంలో ఇళ్లకు సమీపంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలపై సాక్షి దినపత్రికలో ఇటీవల కథనం ప్రచురితమైంది. ఇక్కడ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగల గురించి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని.. ఇప్పుడు విమల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ఆర్ జిల్లా | బుధవారం | ఆగస్టు | 23 | 2017 సాక్షి

భవిష్యం



మేషం: పనుల్లో జాప్యం. ఆరోగ్యసమస్యలు. దూరప్రయాణాలు. సోదరులతో విభేదాలు. శ్రమ తప్ప ఫలితం ఉండదు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

వృషభం: బంధువర్గం నుంచి ఒత్తిడులు. ఆధ్యాత్మిక చింతన. పనులు ముందుకు సాగవు. ప్రయాణాల్లో మార్పులు. దైవదర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు.

మిథునం: నూతన వ్యక్తుల పరిచయం. శుభవార్తలు వింటారు. కొత్త విషయాలు తెలుస్తాయి. విద్యార్థుల కలలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

కర్కాటకం: శ్రమ తప్పకపోవచ్చు. కొన్ని వ్యవహారాలు ముందుకు సాగవు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆకస్మిక ప్రయాణాలు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

సింహం: సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతారు. సేవలకు గుర్తింపు రాగలదు. ఆహ్వానాలు అందుతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

కన్య: రుణదాతల ఒత్తిడులు. ఆలయాలు సందర్శిస్తారు. బంధువులతో తగాదాలు. అనారోగ్యం. ఊహించని ప్రయాణాలు. వృత్తి, వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

తుల: ప్రముఖులతో పరిచయాలు. సంఘంలో గౌరవం. ఆస్తి విషయాలలో ఒప్పందాలు. వాహనయోగం. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు ఒడిదుడుకులు తొలగుతాయి.

వృశ్చికం: చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. పలుకుబడి పెంచుకుంటారు. విద్య, ఉద్యోగావకాశాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలు సజావుగానే సాగుతాయి.

ధనుస్సు: పనుల్లో ఆటంకాలు. దుబారా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దూరపు బంధువుల కలయిక. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో చిక్కులు.

మకరం: ఆదాయానికి మించి ఖర్చులు. ప్రయాణాలు వాయిదా. పనులలో ఆటంకాలు. స్నేహితులతో కలహాలు. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.

కుంభం: శుభకార్యాలలో పాల్గొంటారు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో పురోభివృద్ధి. ఉద్యోగులకు ఒత్తిడులు తొలగుతాయి.

మీనం: చిరకాల మిత్రులను కలుసుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. బాకీలు వసూలవుతాయి. వాహనయోగం. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు.

– సింహంభట్ల సుబ్బారావు

'కారుణ్య' ఎక్స్‌గ్రేషియా పెంపుపై హర్షం

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ మరణించిన వ్యక్తి కుటుంబాలలో తిరిగి నియామకానికి (కారుణ్య నియామకానికి) ఎవరూ అర్హులు (పిల్లలు మైనర్లుగా ఉండి, భార్య, లేదా భర్త) కాకపోతే ఎక్స్‌గ్రేషియో పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు చెంచిరెడ్డి, ఏపీటీఎఫ్ కౌన్సిల్ మెంబర్ బాలానాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గురవయ్య, కడప మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటరమణ, ఈశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

నేడు ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్



ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ ముఖద్వారం

- సూపర్ న్యూమరీ సీట్ల భర్తీకి చర్యలు

వేంపల్లె : రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ పరిధిలో నిర్వహిస్తున్న నాలుగు ట్రిపుల్ ఐటీలలో సూపర్ న్యూమరీ కింద మంజూరైన 656 సీట్లను భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నామని డైరెక్టర్లు భగవన్నారాయణ, బసవరావు తెలిపారు. ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు ఇడుపులపాయ క్యాంపస్‌లోనూ.. నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు నూజివీడు క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఒక్కో ట్రిపుల్ ఐటీకి 160 సీట్లు మంజూరయ్యాయి. మండలాల్లో ఇప్పటి వరకు ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీలలో సీటు దక్కని కేటగిరీలను గుర్తించి సూపర్ న్యూమరీ కింద అదనపు సీట్లను మంజూరు చేశారు. ఆ రకంగా ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించేందుకు ట్రిపుల్ ఐటీలలో చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక కోటా సీట్లు కూడా భర్తీ :

ప్రత్యేక కోటా కింద ఎంపికైన విద్యార్థులకు 23నే అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జూలైలో ప్రత్యేక కోటాకు సంబంధించి క్రీడలు, క్యాప్, వికలాంగుల కోటా కింద నాలుగు ట్రిపుల్ ఐటీలకు 19 సీట్లు ఉండగా.. వాటికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులను ఎంపిక చేయడంలో జాప్యమైంది. ప్రధానంగా స్పోర్ట్స్ కోటాకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన జాప్యం కావడంతో తరగతులు ప్రారంభమై 20 రోజులైనా భర్తీ చేయలేదు. దీనిపై ప్రత్యేక కోటా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఒకింత ఆందోళనకు గురై వెంటనే భర్తీ చేయాలని అధికారులకు విన్నవించడంతో బుధవారం ఆయా ట్రిపుల్ ఐటీలలో ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని ఆర్జీయూకేటీ అధికారులు తెలిపారు.

ఈ పాస్ ద్వారా నిత్యావసరాల పంపిణీ



మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ లింగారెడ్డి

కడప ఎడ్యుకేషన్: చౌక డిపోల్లో నిత్యావసర సరకులను పారదర్శంగా పంపిణీ చేసేందుకు ఈ–పాస్ విధానం అమలు చేయాలని డీలర్ల సంఘం కోరిన మేరకు సిద్దవటం, ఎర్రగుంట్లలో ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ మల్లేల లింగారెడ్డి తెలిపారు. తరువాత అన్ని మండలాల్లో అమలు చేస్తామని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో అన్ని మున్సిపాలిటీల్లో పేద ప్రజల కోసం అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. దీపం పథకం కింద జిల్లాలో 2,09,134 మందికి గ్యాస్ కనెక్షన్లు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1,15,717 మందికి మంజూరు చేశామన్నారు. మిగతా వారికి కూడా త్వరలో ఇస్తామని చెప్పారు. సమావేశంలో డీఎస్‌ఓ విజయరాణి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

'ఓణం'కు ప్రత్యేక బస్సులు

రాజంపేట: ఓణం పండుగకు రాజంపేట డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తోందని రాజంపేట డిపో మేనేజర్ ఎంవీ కృష్ణారెడ్డి వెల్లడించారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో నిర్వహణ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు బస్సు సర్వీసులను నడిపిస్తున్నామని పేర్కొన్నారు. ఆరు రోజుల పాటు ఈ యాత్ర ఉంటుందని చెప్పారు. ఇందులో 17 పుణ్యక్షేత్రాలను సందర్శించే విధంగా రూట్‌ను నిర్ణయించామన్నారు. కాణిపాకం, అరగొండ, బంగా రు దేవాలయం, భవాని, పళని, పంబ, శబిరిమలై, కన్యాకుమారి, సుచ్చేంద్రం, తిరుచందూరు, రామేశ్వరం, దేవిపట్నం, మధురై, శ్రీరంగా, తంజావూరు, తిరువనాణ్ణమలై ఉన్నాయని తెలిపారు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇరుముడి, భోజనం సౌకర్యాన్ని ఆర్టీసీ కల్పిస్తుందని పేర్కొన్నారు. రెండు బస్సులకు 70 మంది యాత్రీకులను తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వచ్చే నెల 1వ తేది నుంచి ఈ యాత్ర డిపో కార్యాలయం నుంచి బయలు దేరుతుందని సూచించారు. యాత్రకు వెళ్లాల్సిన వారు తన ఫోన్ నంబరు 9959225775తోపాటు, 7328868241(పీవీ బీరాజు), 7382863000(కెఎస్‌రావు)ను సంప్రదించాలని వివరించారు.

వచ్చే నెల 8 వరకు ఎంఆర్ వ్యాక్సిన్

ప్రొద్దుటూరు : ఈ ఏడాది సెప్టెంబర్ 8వ తేదీ వరకు పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక శివాజీ వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో వేస్తున్న ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 7.63 లక్షల మంది పిల్లలకు వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 5.52 లక్షల మందికి వేయించామని తెలిపారు. వ్యాక్సిన్‌పై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, తల్లిదండ్రులు తప్పక వేయించాలని కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యరంగయ్య, మెడికల్ ఆఫీసర్ జి.హనీఫ్‌బాబా, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్త వాణి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రామిరెడ్డి

ఎర్రగుంట్ల-నంద్యాల రైళ్ల వేగం పెంపు

ప్రొద్దుటూరు : ఎర్రగుంట్ల – నంద్యాల మార్గంలో నడుస్తున్న రైళ్ల వేగాన్ని గంటకు 50 కిలోమీటర్లకు పెంచారు. మంగళవారం నుంచి ఈ విధానాన్ని అమలు పరిచినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఏడాది క్రితం ఎర్రగుంట్ల – నంద్యాల రైలు మార్గాన్ని ప్రారంభించారు. తొలుత 50 కిలోమీటర్ల ప్రకారం రైళ్లు తిరగాలని నిర్ణయించినా మార్గమధ్యలో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా ఎర్రగుంట్ల – జమ్మలమడుగు పరిధిలో 30 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిచేవి. జమ్మలమడుగు నుంచి నంద్యాల వరకు పగలు 50 కిలోమీటర్లు, రాత్రిళ్లు 30 కిలోమీటర్ల వేగంతో నడుస్తున్నాయి. ప్రస్తుతం సాంకేతిక సమస్యలను పరిష్కరించిన అధికారులు ఎర్రగుంట్ల నుంచి నంద్యాల వరకు 50 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిచేలా చర్యలు తీసుకున్నారు. ఈ విషయంపై రైల్వే అధికారులు మాట్లాడుతూ గతంలో ఎర్రగుంట్ల నుంచి నంద్యాలకు మొత్తం 126 కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు మూడు గంటలు సమయం పట్టేదని, ఇక నుంచి రెండు గంటలు పడుతుందని తెలిపారు.

తిరుమల సమాచారం

తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ బాగా తగ్గింది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 5 కంపార్టుమెంట్లు మాత్రమే నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం:

గదుల వివరాలు:

ఉచిత గదులు – 3 ఖాళీ ఉన్నాయి
రూ.50 గదులు – 15 ఖాళీ ఉన్నాయి
రూ.100 గదులు – 25 ఖాళీ ఉన్నాయి
రూ.500 గదులు – 10 ఖాళీ ఉన్నాయి

సేవలు :

సహస్రదీపాలంకరణ సేవ – 250 ఖాళీ ఉన్నాయి
వసంతోత్సవం – 200 ఖాళీ ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం – 230 ఖాళీ ఉన్నాయి

బుధవారం ప్రత్యేక సేవ
సహస్రకలశాభిషేకం

వాతావరణం

రానున్న 24 గంటల్లో ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్ గంగా పరివాహక ప్రాంతాలు, జార్ఖండ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, తూర్పు రాజస్తాన్, దక్షిణ హరియాణా, ఢిల్లీల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు కురుస్తాయి.

వైఎస్ఆర్ జిల్లా వాతావరణం

గరిష్టం కనిష్టం
34.3°/25.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.1	28.5
కోల్‌కతా	32.7	27.3
బెంగళూరు	28.0	21.1
ముంబై	31.3	22.2
చెన్నై	31.8	27.3

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
ఒంగోలు	36.9/25.3	కర్నూలు	34.0/24.8
గుంటూరు	35.6/24.8	రాజమండ్రి	34.0/24.5
విజయవాడ	35.4/25.2	నల్లగొండ	33.6/26.0
నెల్లూరు	35.1/26.1	శ్రీకాకుళం	33.1/26.0
ఖమ్మం	34.8/22.0	విజయనగరం	33.1/26.0
వరంగల్	34.6/25.0	హైదరాబాద్	32.9/23.1
అనంతపురం	34.6/24.5	రంగారెడ్డి	32.9/23.1
కాకినాడ	34.4/26.5	విశాఖపట్నం	32.3/26.8
తిరుపతి	34.4/24.0	మహబూబ్‌నగర్	32.3/23.6
కడప	34.3/25.0	కరీంనగర్	31.8/23.5
చిత్తూరు	34.3/24.0	నిజామాబాద్	30.6/22.5
ఏలూరు	34.0/27.5	మెదక్	30.4/20.5
తాడేపల్లిగూడెం	34.0/27.5	ఆదిలాబాద్	29.6/20.8

బుల్లితెర

W

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 ఎలక్షన్ డే
ఉ.09.30 ఎలక్షన్ డే
ఉ.10.00 ఎలక్షన్ డే
ఉ.10.30 ఎలక్షన్ డే
మ.02.30 ఎలక్షన్ డే
సా.04.30 ఎలక్షన్ డే
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 అయ్యప్ప దీక్ష
ఉ.09.30 స్నేహగీతం
మ.12.00 రగడ
మ.03.00 నా ఇష్టం
రా.09.00 ఇడియట్



హెచ్‌బీవో
ఉ.06.16 ప్యాసింజర్ 57
ఉ.09.25 ఫూల్స్ గోల్డ్
ఉ.11.28 స్టెప్ అప్
సా.06.55 10,000 బి.సి.
రా.09.00 గెట్ స్మార్ట్




మా మూవీస్
ఉ.07.00 మళ్లీ మళ్లీ ఇది రానిరోజు
ఉ.09.00 మాస్
మ.12.00 జోకర్
మ.03.00 అల్లరి బుల్లోడు
సా.05.00 100% లవ్



మూవీస్ నౌ
ఉ.06.30 ల్యాండ్ ఆఫ్ ద డెడ్
ఉ.08.20 ద బౌర్న్ అల్టిమేటం
ఉ.10.30 బిగ్ హీరో 6
మ.02.25 యాంట్-మ్యాన్
సా.06.25 సూపర్‌మ్యాన్ 3




స్టార్ గోల్డ్
ఉ.09.30 చాందినీ చౌక్ టు చైనా
మ.12.45 కృష్ణా కాటేజ్
మ.03.30 ప్రేమ్ రతన్ ధన్ పాయో
సా.06.55 సింగం
రా.10.00 విధ్వంసక్:ద డెస్ట్రాయర్



జీ సినిమా
ఉ.04.45 క్యోం! హో గయా నా
ఉ.07.57 ఫటా పోస్టర్ నిఖ్‌లా హీరో
మ.02.45 ఆర్జూ
సా.06.05 మేరా బద్లా: రివెంజ్
రా.09.00 ఇంటర్నేషనల్ రౌడీ

రిపోర్టర్ల ఫోన్ నెంబర్లు : కడప అర్బన్- దుర్గాప్రసాద్ : 98496 52908 అగ్రికల్చర్- ప్రభాకర్‌రెడ్డి : 97053 47653, సెవెన్ రోడ్స్- ఫణి : 91775 86087, కార్పొరేషన్- కిశోర్ : 98666 38987, కల్చరల్- పవన్ : 98855 06765, స్పోర్ట్స్- నాగరాజు: 9059851188, రూరల్- విశ్వప్రసాద్: 9705347649, ఎడ్యుకేషన్ - యల్లారెడ్డి : 8008003074 కోటిరెడ్డి సర్కిల్-జయరాజ్:9010278698, వైఎస్ఆర్ సర్కిల్- కొండయ్య : 9866930982



దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలో దోమల నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి మగ్బూల్‌బాషా డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాత్రి, పగలు తేడాలేకుండా దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం దారుణమన్నారు. మలేరియా, డెంగీ బారిన పడి విద్యార్థులు మృతి చెందుతున్నా.. దోమల నివారణకు చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. దోమలపై దండయాత్ర కార్యక్రమం దండగయాత్రగా మారిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు తస్లీమ్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు ప్రకాశం పంతులు జయంతి

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిస్తున్నట్లు డీఆర్వో నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీ ఎస్టీ కేసులో నిందితుడి అరెస్టు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో పటేల్‌రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు స్కూలులో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆవుల నాగార్జునరెడ్డి.. అదే పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న చింతకుంట వెంకటేశ్‌ను కులం పేరుతో దూషించి బెదిరించాడు. వాచ్‌మెన్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు నాగార్జునరెడ్డిని మంగళవారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు తరలించారు.

నిరంతర సాధనతోనే లక్ష్య సాధన సులభం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : నిరంతర సాధన ద్వారానే దేనినైనా సులభంగా సాధించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు ఓ. వెంకటేశ్వరరెడ్డి అన్నారు. కడప నగర శివార్లలోని స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం 'మై సెల్ఫ్ అండ్ మై సక్సెస్' అనే అంశంపై ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులు చదువుతున్నప్పుడు ప్రొఫెషనల్‌గా ఆలోచించాలని సూచించారు. నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకుని, దాన్ని సాధించేవరకు పట్టు విడవకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజోలి సాయిచరణ్‌రెడ్డి, కళాశాల పిన్సిపాల్ వెంకటేశ్వరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి

కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజనల్ పరిధిలో పని చేస్తున్న ప్రతి డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించాలని కడప రీజనల్ మేనేజర్ టి. చెంగల్ రెడ్డి సూచించారు. మంగళవారం ఆర్‌ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి, ప్రమాదాలకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ ఇబ్రహీం, డ్రైవర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మంగళవారం స్థానిక చౌడమ్మ వృద్ధాశ్రమానికి బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత కడప మండల అధ్యక్షుడు కాల్వ ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి రాటాల గోపి, సభ్యులు చంద్రశేఖర్, మునుస్వామి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అయ్యో వానరం..!

కుక్కల దాడి.. ఫలించని పశు వైద్యుల శ్రమ

కడప అగ్రికల్చర్ :

కరుణ మృగ్యమై, క్రూరత్వం ఎలా ఉంటుందో మాటల్లో వ్యక్తం కాని పశుప్రవర్తన ఇది. కడప నగరంలోని పాత రిమ్స్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. పాత రిమ్స్‌లో కొన్ని కోతులు చెట్లపై ఆనందంగా తిరుగుతున్నాయి. అదే సమయంలో నాలుగైదు కుక్కలు కోతులపై దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీన్ని పసిగట్టిన కొన్ని కోతులు చెట్లపైకి పాకుతూ తప్పించుకున్నాయి. ఇంతలో నిండు గర్భిణిగా ఉన్న ఓ కోతి చెట్టుపైకి ఎగబాకలేకపోయింది. ఇదే అదునుగా భావించిన కుక్కలు దానిపై మెరుపు దాడి చేశాయి. ఊహించని సంఘటనతో భయభ్రాంతికి గురైన వానరం చెట్టు పై నుంచి కిందపడిపోయింది. దీంతో వెంటనే కుక్కలు ఆ కోతిపై ముప్పేట దాడి చేశాయి. వెనక కాలు పిక్కను, రొమ్ము వద్ద కండరాన్ని పీకడంతో పొట్ట లోపలి భాగాలన్నీ కనిపిం చాయి. శరీరం ఛిద్రంకావడంతో భయానక పరిస్థితి ఏర్పడింది. ఇంతలో ఆ మార్గంలో వెళుతున్న కొందరు కుక్కలను తరిమి, కోతిని హుటాహుటిన కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న పశుసంవర్ధకశాఖ పాలీ క్లీనిక్‌కు తరలించారు. ఏడీ హేమంత్ కుమార్, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. కోతిని బతికేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనను చూసిన అక్కడివారు కళ్లు చెమర్చారు.



సంపు నుంచి కోతిని బయటకు తీస్తున్న వైద్య సిబ్బంది



వానరానికి చికిత్స చేస్తున్న వైద్యుడు, సిబ్బంది

ఉక్కు పరిశ్రమతోనే నిరుద్యోగ యువతకు ఉపాధి



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న మల్లికార్జున

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించడంతోనే నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని చైతన్య విద్యాసంస్థల అధినేత మల్లికార్జున పేర్కొన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలంటూ కోటిరెడ్డి సర్కిల్లో ఆర్‌సీపీ చేస్తున్న వంద రోజుల దీక్షలు మంగళవారం 47వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు సంఘీభావం తెలుపుతూ అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు జిల్లాపై వివక్ష వీడి, ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాజధాని పేరుతో అంతో ఇంతో జరుగుతున్న అభివృద్ధి అంతా అమరావతికే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు కాటకాలతో రాయలసీమ ప్రజలు వలసలు వెళుతున్నా సీఎం పట్టించుకోకపోవడం దౌర్భాగ్యకరమన్నారు. ఇప్పటికైనా విభజన చట్టంలో పేర్కొన్న మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మురళి, పీరయ్య, అయ్యవారయ్య, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవామార్గాన్ని అలవర్చుకోవాలి

కడప అర్బన్ : యువత చెడు మార్గాలను విడనాడి, సమాజానికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేపట్టాలని కడప వన్‌టౌన్ సీఐ టీవీ సత్యనారాయణ యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని బృహద బ్లడ్‌బ్యాంకులో బ్లడ్ టూ లీవ్ స్వచ్ఛంద సేవా సంస్థ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, రక్తదాతలకు సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యువత పాల్గొని రక్తదానం చేశారు. అంతకు ముందు సంస్థ కార్యదర్శి ఆశాజ్యోతి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

ఎన్ఎంయూ దీక్షలు విరమణ

కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ కార్యాలయం ఎదురుగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలను మంగళవారం సాయంత్రం ఆర్‌ఎం చెంగల్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా నాయకులు పీవీ శివారెడ్డి, సుధాకర్, నాగముని, రామిరెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఎంతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని, ఆయన హామీ మేరకు దీక్షలను విరమింపజేస్తున్నట్లు తెలిపారు.

నంద్యాల, కాకినాడల్లో గెలుపు వైఎస్సార్ సీపీదే



మాట్లాడుతున్న శివశంకర్ తదితరులు

కడప కార్పొరేషన్: నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తుమ్మలకుంట శివశంకర్, ఎంపీ సురేష్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు నంద్యాల నియోజకవర్గ ఓటర్లను ఎన్ని రకాలుగా ప్రలోభాలకు గురిచేసినా ప్రజలు మాత్రం వైఎస్సార్‌సీపీని గెలిపించాలనే కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారంతో నంద్యాల ప్రజలు మంత్రముగ్ధులయ్యారని, ఆయన నాయకత్వాన్ని బలపరిచేందుకు ఉవ్విల్లూరుతున్నారని చెప్పారు. ధర్మానికి, అధర్మానికి, న్యాయానికి, అన్యాయానికి మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఓటర్లుకు రూ.5వేల వరకు డబ్బులిచ్చి ఓట్లు కొనుగోలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికార పక్షం ఎన్నికుయుక్తులు పన్నినా నంద్యాల ఉప ఎన్నికలు, కాకినాడ మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని తెలిపారు. సమావేశంలో వల్లూరు ఎంపీపీ శివకుమార్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

పీవీఆర్‌కే ప్రసాద్‌కు ఘన నివాళి

కడప కల్చరల్ : తిరుమల–తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పీవీఆర్‌కే ప్రసాద్ మృతిపై ధార్మిక సంస్థల సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక దేవాదాయశాఖ కార్యాలయంలో ఆ శాఖ సూపరింటెండెంట్ జె.వెంకట సుబ్బయ్య, సిబ్బంది, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు (హెచ్‌డీపీటీ) సభ్యులు పీవీఆర్‌కే ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ తిరుమలలో నిత్యాన్నదాన పథకం, అన్నమయ్య ప్రాజెక్టు ఏర్పాటు, నిర్వహణతోపాటు భక్తులకు స్వామి దర్శనాన్ని సులభంగా కల్పించేలా చర్యలు తీసుకున్నారని కొనియాడారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవాలకు ఎంపిక



సుబ్రమణ్యం

రాజంపేట : ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవ ఉత్సవాలకు జిల్లా నుంచి ఏఐటీఎస్ (అన్నమాచార్య కళాశాల)లో ఎంబీఏ విభాగాధిపతిగా పని చేస్తున్న సుబ్రమణ్యంను ఎంపిక చేశారని ఎస్కే యూనివర్సిటీ రీజనల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.వేణుగోపాల రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలను సుబ్రమణ్యం సందర్శించి, అక్కడి విద్యార్థులకు జిల్లాలోని విహార ప్రదేశాల గురించి పోస్టర్ పెయింటింగ్, క్విజ్ పేపర్ ప్రెజెంటేషన్, టూరిజం ఫొటోగ్రఫీ వంటి అంశాలపై పోటీలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఒక్కొక్క కళాశాల నుంచి ప్రతి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఒకరిని ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారు కడపలోని వైవీయూలో సెప్టెంబర్ 8న జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. అందులో ప్రతిభ చాటిన ఒక విద్యార్థిని సెప్టెంబర్ 12న అనంతపురం ఎస్కే యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఇందులో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు సెప్టెంబరు 27న సీఎం చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా కో ఆర్డినేటర్ పి.సుబ్రమణ్యం ఫోన్ నంబర్: 7093769885ను సంప్రదించాలని కోరారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే కరువు



సమావేశంలో మాట్లాడుతున్న ఓబుల్ కొండారెడ్డి

రాయచోటి రూరల్ : పాలకుల నిర్లక్ష్యంతోనే రాయలసీమలో కరువు ఏర్పడిందని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ జి.ఓబుల్ కొండారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంలో వివక్ష కారణంగా పనులు పూర్తి కాలేదన్నారు. గత ఖరీఫ్‌లో వేరుశనగ పూర్తిగా నష్టపోయినా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల భీమా అరకొరగానే రైతు చేతికందిందన్నారు. కార్యక్రమంలో దస్తిగిరిరెడ్డి, భగవాన్ సహాయరెడ్డి, ఈశ్వరయ్య, రామాంజులు, ఫయాజ్, నరిసంహులు, లక్ష్మిరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



దీక్షను ప్రారంభిస్తున్న మానవ హక్కుల కన్వీనర్ జయశ్రీ

ప్రొద్దుటూరు : గత ఎన్నికల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జయశ్రీ డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్ సర్కిల్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో కూర్చున్న వారికి పూలదండలు వేసి, ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో భాగంగా కేంద్రం జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాల్సి ఉందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇంటికో ఉద్యోగమని యువతను మోసగించి అధికారం చేపట్టారన్నారు. స్టీల్ ప్లాంట్ సాధనా సమితి అధ్యక్షుడు ప్రవీణ్‌కుమారెడ్డి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలలక్షుమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, సీఐటీయూ కార్యదర్శి మహబూబ్‌వలి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో కుళ్లిన గుడ్లు

- పాఠశాలలకు అందజేస్తున్న కాంట్రాక్ట్ సంస్థ
- ఇబ్బంది పడుతున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు



ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అయిన కుళ్లిన గుడ్లు

రాజంపేట టౌన్:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఎప్పుడు ఉన్నా కాంట్రాక్టర్ల జేబులు నింపుతారనేందుకు మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేస్తున్న కోడుగుడ్లు కూడా ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గత నెల వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ నిర్వాహకులే వారానికి రెండు కోడి గుడ్లను విద్యార్థులకు అందజేసేవారు. అయితే ఈ నెల 1 నుంచి ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్లను సరఫరా చేసే బాధ్యతను ఓ కాంట్రాక్టు సంస్థకు అప్పజెప్పింది. దీంతో ఆ సంస్థ కడప జిల్లాతోపాటు మరో రెండు జిల్లాలకు కోడిగుడ్లను సరఫరా చేస్తోంది. అయితే మండలంలో అనేక పాఠశాలలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లు చాలా వరకు కుళ్లిపోయి, దుర్వాసన వస్తున్నాయి. వాటిని ఉడకబెట్టి బొప్పెట తీసే సమయంలో.. భరించలేని దుర్వాసన వస్తుండటంతో వంట మనుషులు పడుతున్న ఇబ్బంది అంతాఇంతా కాదు. ఇదిలా ఉంటే గుడ్లు కుళ్లిపోవడం వల్ల వంట ఏజెన్సీ నిర్వాహకులు వాటిని పడేసి దుకాణాల్లో కొనుగోలు చేసి విద్యార్థులకు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల మధ్యాహ్న వంట ఏజెన్సీ నిర్వాహకులు రెండు విధాలుగా నష్టపోవాల్సి వస్తోంది. కోడిగుడ్లను ప్రభుత్వం కాంట్రాక్టర్ ద్వారా సరఫరా చేస్తున్నందున.. ఒక్కొక్క దానికి రూ.2.35లను వంట ఏజెన్సీల బిల్లు నుంచి వసూలు చేస్తుంది. అయితే గుడ్లు చెడిపోవడం వల్ల నిర్వాహకులు బయట దుకాణాల్లో కొనుగోలు చేసి విద్యార్థులకు పెడుతుండటంతో చేతి నుంచి డబ్బులు వేసుకోవాల్సి వస్తోంది.

తగ్గిన సైజు

కోడిగుడ్ల సైజు చాలా తగ్గింది. సాధారణంగా 40 నుంచి 50 గ్రాముల వరకు కోడిగుడ్డు ఉంటుంది. ప్రస్తుతం పాఠశాలలకు సరఫరా అవుతున్న గుడ్ల సైజు 30 నుంచి 35 గ్రాములు మాత్రమే ఉండటంపై విద్యార్థులు, తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో ఖర్చుకు వెనకాడమని గతంలో పలు మార్లు వివిధ సభల్లో చెప్పుకొచ్చారు. అయితే విద్యార్థులకు ప్రస్తుతం పెడుతున్న కోడిగుడ్డు సైజు భారీగా తగ్గడంతో పేద పిల్లలకు పౌష్టికాహారం ఎలా అందుతుందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన, పెద్దసైజు కోడి గుడ్లను సరఫరా చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



సాధారణ గుడ్లు (ఎడమ వైపు), సైజు తక్కువ ఉన్న గుడ్లు (కుడివైపు)

లక్ష్యాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి

బద్వేలు అర్బన్ : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్దేశించిన లక్ష్యాలను వెలుగు సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో 7 మండలాల ఏపీఎంలు, సీసీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు పెండింగ్ బకాయిలను సకాలంలో వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పండ్ల తోటల పెంపకం, వర్మీ కంపోస్టు యూనిట్లు, పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఏరియా కో ఆర్డినేటర్ రాజు, ఫైనాన్స్ డీపీఎం హరిప్రసాద్‌రాజు, ఏపీఎంలు బి.వి.సుబ్బారెడ్డి, సుజాత, వెంకటనారాయణ, వీరాంజనేయులు, గంగార్జున, శివప్రసాద్, హార్టికల్చర్ ఏపీఎంలు నిరంజన్, ప్రకాష్, సీసీలు రవికుమార్, వెంకటసుబ్బయ్య, అర్జున్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే

మైదుకూరు టౌన్ :



ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

నంద్యాల ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధమయ్యారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాల వల్లనే 2014లో అధి కారంలోకి వచ్చారని, అదే విధానాన్ని నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రయోగించారన్నారు. అయితే నంద్యాల ప్రజలు ఇక తాము మోసపూరిత మాటలు నమ్మలేమంటూ చంద్రబాబు బహిరంగ సభలకు కూడా వెళ్లలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రచారానికి వెళ్లిన ప్రతి పల్లె, వీధిలో ఆయనకు బ్రహ్మరథం పట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు ఇదొక నిదర్శనం అన్నారు. నేడు పోలింగ్ జరగబోయే ఉప ఎన్నికల్లో నంద్యాల నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

శుద్ధి నీటిని ఉచితంగా అందించాలి

మున్సిపల్ కార్యాలయం ముట్టడించిన బీజేపీ నాయకులు, మహిళలు



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్) బైఠాయించిన బీజేపీ నేత బాలచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్ : శుద్ధి నీటిని ప్రజలు కొనలేక పోతున్నారని, ఉచితంగా ఇవ్వాలని మున్సిపల్ కార్యాలయాన్ని బీజేపీ నాయకుడు కొవ్వూరు బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. సంజీవయ్యనగర్, స్వరాజ్యనగర్ చెందిన మహిళలు ఖాళీ బిందెలతో వచ్చి మున్సిపల్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. దీంతో కార్యాలయంలోకి అధికారులు, ప్రజలు ఎవ్వరూ వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇంతలో అక్కడికి వచ్చిన మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కమిషనర్ శేషన్న బాలచంద్రారెడ్డితో ఆయన మాట్లాడారు. కుందూ – పెన్నా వరద కాలువ మాదిరిగా మైలవరం నుంచి పైప్‌లైన్ పనులు నిలిచి పోకూడదన్నారు. మొదట చెన్నమరాజుపల్లె నుంచి నీటిని తీసుకొస్తామని చెప్పారని, మళ్లీ మైలవరానికి మార్చారన్నారు. సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన అధికారులు, చైర్మన్ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

ఒంటిమిట్ట(రాజంపేట) :

రెండవ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం రాత్రి పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు పూజ కార్యక్రమాలు చేశారు. చతుష్టానార్చన, పవిత్రప్రతిష్ఠ, సాయంత్రం పవిత్రహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలకు కేవలం టీటీడీ అధికారులు మాత్రమే పాల్గొన్నారు. కాగా పవిత్రోత్సవాలపై టీటీడీ పెద్దగా ప్రచారం చేయకపోవడం వల్ల భక్తులు చూడలేకపోయారనే విమర్శలు వస్తున్నాయి.



ఆలయంలో పవిత్రోత్సవాలను టీటీడీ అధికారులు మాత్రమే వీక్షిస్తున్న దృశ్యం

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఆదాయం వచ్చేలా చర్యలు

– మెప్మా సీఎంసీ నర్మద

కడప కార్పొరేషన్ : స్వయం సహాయక సభ్యులకు నెలకు రూ.10 వేల ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని మెప్మా స్టేట్ మిషన్ కో ఆర్డినేటర్ నర్మద ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో స్త్రీ నిధి రుణాలను జీవనోపాధులకు వినియోగించుటపై మెప్మా సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణంతో ఆ కుటుంబం రూ.10 వేలు ఆర్జించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెర్ఫ్ ఏజీఎం నాగేంద్ర ప్రసాద్ , మెప్మా పీడీ రామమోహన్‌రెడ్డి, నాగరాజారావు, స్త్రీ నిధి కో ఆర్డినేటర్ అనితాదీప్తి పాల్గొన్నారు.

యూజీసీ వేతన సవరణ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలి



నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

వైవీయూ : యూజీసీ వేతన సవరణ కమిటీ సమర్పించిన నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (జీసీజీటీఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీదం విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ఏడో వేతన సవరణ అమలు జాప్యంపై ఆలిండియా ఫెడరేషన్ ఆఫ యూనివర్సిటీస్ అండ్ కాలేజి టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్‌యూసీటీఓ) ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు.

రహదారుల పక్కనే విశ్రాంతి

- ప్రయాణికులు, డ్రైవర్ల కోసం వే సైడ్ ఎమినిటీ సెంటర్లు
- సరికొత్త విధానాన్ని ఆవిష్కరించిన కేంద్రం



జాతీయ రహదారులు



వే సైడ్ ఎమినిటీ సెంటర్ల నమూనా

కడప కార్పొరేషన్ :

దేశంలోని అన్ని జాతీయ రహదారుల పక్కన ప్రయాణికులు, డ్రైవర్ల కోసం ప్రతి 50 కిలోమీటర్లకు ఒకటి చొప్పున సౌకర్య కేంద్రాలు (వే సైడ్ ఎమినిటీ సెంటర్లు) అభివృద్ధి చేయాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ నిర్ణయించింది. కారు, బస్సు ప్రయాణిలతోపాటు భారీ వాహనాల డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు వీటిలో సదుపాయాలు కల్పించనున్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ)ఈ బాధ్యతలు చూసుకుంటుంది. అమెరికా, జర్మనీ తరహాలో ఈ కేంద్రాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు సరికొత్త విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. ఈ కేంద్రాల్లో కార్లు, బస్సులు, ట్రక్కులకు పార్కింగ్ స్థలాలు కేటాయిస్తారు. పెట్రోల్ బంకులు, వాహన మరమ్మతు కేంద్రాలు, విశ్రాంతి గదులు, డార్మిటరీలు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, దాబాలు, వ్యవసాయ, చేనేత ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తు రాబోతున్న ఎలక్ట్రిక్ కార్లను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ చార్జింగ్ వ్యవస్థలు నెలకొల్పుతారు. మూడు భాగాలుగా ఈ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

సెప్టెంబర్ 21 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు

ఐదు ఎకరాలలోపు స్థలం ఉండి స్థలంలో ఏర్పాటయ్యే కేంద్రాన్ని హైవే నెస్ట్ అని, అంతకన్నా ఎక్కువ స్థలంలో నెలకొల్పే కేంద్రాన్ని హైవే విలేజ్ అని పిలుస్తారు. ఐదు ఎకరాలకు పైబడి స్థలం ఉన్న వ్యక్తులు సొంతగా నూ ఈ కేంద్రాలను అభివృద్ధి చేసుకోవచ్చు. ముందుకొచ్చేవారికి ప్రభుత్వమే జాతీయ రహదారుల అనుసంధానాన్ని కల్పిస్తుంది. జాతీయ రహదారులకు ఆనుకొని భూములున్న ప్రైవేటు వ్యక్తులు ఆగష్టు 4 నుంచి తమ ఆసక్తిని వ్యక్తం చేస్తూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ కార్యాలయాల్లో సెప్టెంబర్ 21లోపు దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి–తిరుత్తణి, చెన్నై సెక్షన్‌లో ఎన్‌హెచ్–205పై ఎస్‌వీ పురం గ్రామం వద్ద, అనంతపురం–బెంగళూరు సెక్షన్‌లో రేగాటిపల్లి గ్రామం వద్ద (అనంతపురం జిల్లా) ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. త్వరలో ఇతర జాతీయ రహదారుల్లో కూడా వీటిని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ కేంద్రాల్లో విశ్రాంతి తీసుకోవడానికి, పార్కింగ్, ఇతర అవసరాలను బట్టి నిర్ణీత ధరలను నిర్ణయించనున్నారు.

ప్రయాణికుల అవసరాలు తీరేలా సదుపాయలు

తొలి విభాగంలో సాధారణ ప్రయాణికులు, భారీ వాహనాల డ్రైవర్ల అవసరాలకు తగినట్లుగా, రెండో విభాగంలో ప్రత్యేక తరగతి ప్రయాణికుల అవసరాలు తీర్చేలా సదుపాయాలు ఉంటాయి. మూడో విభాగాన్ని ట్రక్ డ్రైవర్లకు కేటాయిస్తారు. మొత్తం స్థలంలో 20 శాతంలోనే నిర్మాణాలుంటాయి. మిగిలిన 80 శాతం పార్కింగ్, ఇతర వినోద సదుపాయాలకు కేటాయిస్తారు.

చారిత్రక కట్టడాలను రక్షించాలి

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు పర్యాటక పుస్తకాలను అందజేస్తున్న సీతారామయ్య

కడప కల్చరల్ : జిల్లాలోని చారిత్రక కట్టడాలను రక్షించి వాటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక, వారసత్వ పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు సిద్దవటం సీతారామయ్య కలెక్టర్ బాబూరావునాయుడును కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలిసి పర్యాటకరంగంపై తను రచించిన పలు పుస్తకాలను అందజేశారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక, చారిత్రక ప్రాంతాల విశేషాలను వివరించారు. గండికోటలో పర్యాటకులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి జ్యోతి జార్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో కనీస వేతనాలు చెల్లించాలి




మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు యాజమాన్యం చెల్లించే అరకొర జీతాలు సరిపడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజులను వసూలు చేస్తూ లాభాలు పొందుతున్నప్పటికీ ఉపాధ్యాయులకు మాత్రం కనీస వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లు సమర్పించిన కళాశాలలపై చర్యలు

వైవీయూ వీసీ ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డి

వైవీయూ : వైవీయూ పరిధిలోని అనుబంధ కళాశాలల అఫిలియేషన్ ప్రక్రియలో కొన్ని కళాశాలలు నకిలీ డాక్యుమెంట్లతో గుర్తింపు పొందారన్న ఆరోపణలపై విశ్వవిద్యాలయ అధికారులు స్పష్టత ఇచ్చారు. మంగళవారం వైస్ చాన్సలర్‌లను విద్యార్థి సంఘాలు కలిసి ఈ విషయమై ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన వైస్ చాన్సలర్ ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైవీయూ అనుబంధ కళాశాలల అఫిలియేషన్ ప్రక్రియలో నకిలీ డాక్యుమెంట్లు సమర్పించిన కళాశాలలపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కళాశాలలకు తమకు ఉండాల్సిన రెండు ఎకరాల భూమి, కళాశాల భవనం కట్టిన స్థలంకు సంబంధించిన డాక్యుమెంట్లను, సంబంధిత రెవిన్యూ కార్యాలయంలో ఈసీ చేయించుకుని ఆగస్టు 31వ తేదీలోపు పునః పరిశీలనకు సమర్పించాలని కోరామని తెలిపారు. నకిలీ డాక్యుమెంట్లకు సంబంధించి రాష్ట్ర ఉన్నత విద్యామండలికి లేఖరాసి వారికి కళాశాలలు పంపిన డాక్యుమెంట్లను పునఃపరిశీలించమని కూడా కోరుతామని పేర్కొన్నారు. అఫిలియేషన్ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జన్మభూమి పోర్టల్ ద్వారా సమాచారం అప్‌లోడ్ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.చంద్రయ్య పాల్గొన్నారు.



నేడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

తెలుగు కీర్తి 'ప్రకాశం'

కడప కల్చరల్ : ఆంధ్రకేసరి...ఆ పేరులోనే ఓ దర్పం...ఆయన వర్తనలో కూడా తెలుగు పౌరుషం.....నిరాడంబరం....నిజాయితీ....పట్టుదల....క్రమశిక్షణ...నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతవారినైన ఎదురించే గుణం, నచ్చని అంశంపై నిప్పులు కక్కే తత్వం, నిజాయితీకి నిలువెత్తు రూపం, తన గుండెను తుపాకీకి అడ్డుపెట్టి తెల్ల దొరలను సైతం తెల్లబోయేలా చేసిన సాహససింహం తెలుగు విలువల పతాకం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. నేడు ఆయన జయంతి. ఈ నేపథ్యంలో కడపతో ఆయనకు గల బంధం గురించి క్లుప్తంగా...

- ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి అంతగా తెలిసి ఉండకపోవచ్చు. కానీ, మొన్నటితరం నేత అయిన ఆయన పేరు వినగానే నిన్నటి తరానికి గర్వంతో గుండె ఉప్పొంగుతుంది. పలువురి పెద్దలు ఆయన గురించి తలుచుకుంటూ ఆయన అడుగు ఓ పిడుగు అని, మాట సింహ గర్జన అని, ప్రేమతో పలకరిస్తూ నవనీతం, ఆగ్రహిస్తే అగ్ని వర్షం అని అభివర్ణిస్తూ మురిసిపోతుంటారు.

> రండిరా యీదె కాల్చుకొండిరాయని నిండు
> గుండెలిచ్చిన మహోద్దండ మూర్తి
> సరస్వమూ స్వరాజ్య సమర యజ్ఞము నందు
> హోమమ్మెనర్చిన సోమయాజి
>
> ప్రకాశం పంతులు గురించి ప్రముఖ కవి కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి అన్న మాట ఇది!

కొన్నాళ్లు కడపలో...

- 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ప్రకాశం తన ఎత్తుగడలో భాగంగా కొన్నాళ్లు మన జిల్లాలో ఉన్నారు. అప్పటి మన జిల్లా నాయకులు కడప కోటిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, బసిరెడ్డి తదితరులతో కలిసి ఇక్కడే రాజకీయ మంతనాలు జరిపారు.
- బ్రిటీషు వారు కడపలోనే ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు.
- ప్రకాశం పంతులు శతజయంతి ఉత్సవాలను నిర్వహించిన సందర్భంగా కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో 1976 ఏప్రిల్ 20న ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాటి కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, స్థానిక నాయకులు పి.బసిరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు, నాటి కలెక్టర్ పీఎల్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రకాశం జీవితం

- ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23వ తేదిన జన్మించారు. 1957 మే 20న కన్నుమూశారు. పేదరికంలో ఉన్న బాగా చదివి న్యాయవాదిగా పనిచేశారు. 1926లో సత్యాగ్రహం ఉద్యమంలోకి ప్రవేశించారు. 'స్వరాజ్య' దినపత్రికను స్థాపించారు.
- 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఆయనను తెల్లవారు కడపలో నిర్బంధించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉత్తమమైన పాలనను ప్రారంభించారు. 1972లో ఒంగోలు జిల్లాకు ఆయన పేరు ప్రకాశం జిల్లాగా మార్చారు. రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాకు ఒక నాయకుడి పేరు పెట్టడం ఆయనతోనే మొదలైంది. తెలుగుభాషను ఎంతగానో ప్రేమించే తెలుగుకు ప్రాచీన భాష హోదా దక్కడంలో చిక్కులు తొలగిన ఈ సంవత్సరంలోనే ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ ఉండడం విశేషం.


కడపలో...

కడప నగరంలో ఏడురోడ్ల కూడలిలో 1976లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ కూడలికి ప్రకాశం సర్కిల్‌గా నామకరణం చేశారు. ఆయనపై గౌరవంతో కడప నగరం దొంగల చెరువులోని ఓ ప్రాంతానికి ప్రకాశం నగర్‌గా పేరు పెట్టారు.

కడప కల్చరల్ :

వినాయక చవితి పండుగ అంటే పిల్లలు, పెద్దలకు కూడా ఎంతో ఇష్టం. వినాయకుడిని కొని తెచ్చి వీధి కూడళ్లలో ప్రతిష్ఠించి, రోజంతా గణపయ్యను స్తుతిస్తూ ఆడి, పాడి, ప్రసాదాలు స్వీకరించి ఆనందంగా గడుపుతారు. తప్పులు మన్నించాలని గుంజీలు తీస్తారు. విద్యార్థులు పుస్తకాలను స్వామి వద్ద ఉంచి తమకు బాగా చదువు వచ్చేలా దీవించాలని కోరుతారు. అందరూ ఒక్కటై కార్యక్రమాల నిర్వహణకు పోటీలు పడతారు. నిజానికి వినాయక చవితి పండుగ అంటే కేవలం పూజలు, ప్రసాదాలు మాత్రమే కాకుండా దీని వెనుక ఎన్నో సామాజిక అంశాలు ఉన్నాయంటే ఆశ్చర్యమే కదా! అందులోనూ భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఈ పండుగ ఎంతో తోడ్పడిన విషయం కూడా పలువురికి తెలియదు. అసలు ఇళ్లలో మాత్రమే చేసుకునే వినాయక చవితి పూజలు, వీధి కూడళ్లలో నిర్వహించుకునేందుకు దారి తీసిన పరిణామాల గురించి సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

- వినాయక చవితి పండుగను పూర్వం ఇళ్లలో మాత్రమే నిర్వహించుకునే వారు. స్వాతంత్రోద్యమ సమయంలో లోకమాన్య బాలగంగాధర తిలక్ ప్రజలందరినీ ఒకేచోట కూడగట్టి స్వాతంత్ర్యం అవసరాన్ని గురించి వివరించి వారిలో పోరాట స్ఫూర్తి నెలకొనేందుకు ఊరిలోని ప్రధాన కూడలిలో ఓ మోస్తరు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే పద్ధతిని మొదలు పెట్టారు.
- మహారాష్ట్రలో ప్రారంభమైన ఈ పద్ధతిలో భాగంగా చుట్టుపక్కల వీధులకు చెందిన ప్రజలంతా ఆ పందిరి వద్దకు వచ్చి పూజలు చేసేవారు. ఆ తర్వాత స్వాతంత్ర్య ఉద్యమ పరిస్థితిని చర్చించుకుని చేపట్టాల్సిన కార్యచరణ గురించి నిర్ణయం తీసుకునే వారు. బ్రిటీషు వారికి ఇది కంటగింపుగా మారింది. భారతీయుల్లో ఐక్యత పెరుగుతుందేమోనన్న భయంతో బహిరంగంగా చవితి పండుగ చేసుకోవడాన్ని నిషేధించారు.
- తిలక్ నాయకత్వంలో ఈ నిషేధాన్ని ధిక్కరించి ప్రజలు మరికొన్ని కూడళ్లలో పందిళ్లు వేసి పూజలు ప్రారంభించారు. చేసేది లేక బ్రిటీషు వారు మిన్నకుండిపోయారు. అప్పటి నుంచి బహిరంగ ప్రదేశాల్లో వినాయకుని విగ్రహాల ఏర్పాటు మొదలైంది.



పూజా పత్రి..

పండుగ రోజు వినాయకుడిని ప్రకృతిలో లభించే వివిధ రకాల ఆకులు, పూలతో పూజ చేస్తారు. పూజా పత్రి కోసం పిల్లలు చెట్లు, పొదలు గాలిస్తారు. పత్రి కోసం మొక్కల ఆకులను, చిగుర్లను తుంచడంతో మొక్కల కాండం బలపడుతుంది. సేకరించే పత్రిలో పలు ఔషధ గుణాలుంటాయి.

తాత్విక సందేశం..

వినాయక చవితి పండుగలో భాగంగా మట్టితో స్వామి బొమ్మను తయారు చేసి పూజించి మూడవరోజు నీటిలో నిమజ్జనం చేస్తారు. మనిషి దేవుడు చేసిన బొమ్మ అని, మధ్యలో అనుభవించే వైభవం శాశ్వితం కాదని, జీవితం మూడునాళ్ల ముచ్చటేనన్న తాత్విక సందేశాన్ని ఈ పండుగ మనకు తెలియజేస్తోంది.



విలక్షణ రూపం..

గణపయ్య బొమ్మను తయారు చేసేందుకు పిల్లలు ఎంతో ఆసక్తి చూపుతారు. ఏనుగు తలతో వినాయకుని రూపం విలక్షణంగా ఉండడమే వారి ఆసక్తికి కారణం. స్వామికి చేసే పూజల్లో ప్రతి అంశం రైతుల జీవితాలతో ముడిపడి ఉంటుంది. పూజా విధానం కూడా బాలల్లో ప్రకృతి పట్ల పరిశీలన పెంచేందుకు, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు తోడ్పడుతుంది.

- గణపతి శరీరంలో బొజ్జను ధాన్యాన్ని నిలువ ఉంచే 'గాదె'తో పోలుస్తారు. చెవులు గాదెలోని ధాన్యాన్ని చెరిగేందుకు ఉపయోగపడే చేటలుగా, చిన్న కళ్లు సూక్ష్మ దృష్టికి, నిశిత పరిశీలనకు ప్రతీకలుగా చెబుతారు.

శ్రీ వినాయ



కడప నగరంలోని ఎన్జీ ఓ కాలనీలో భారీ సెట్టింగ్



కడప నగరంలోని చిన్నచౌక్‌లో పందిరి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

డెకరేషన్‌కు భారీ ఖర్చు...

కడప కల్చరల్ : జిల్లా అంతటా వినాయక చవితి పండుగకు ఏర్పాట్లు జోరందుకున్నాయి. పలు పందిళ్లలో ఇప్పటికే భారీ సైజు గణపతి విగ్రహాలను కొలువుదీర్చారు. జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పందిళ్ల వద్ద పండుగకు దాదాపు రూ. 20 కోట్లను ఖర్చు చేయనున్నారు. కేవలం కడప నగరంలోనే దాదాపు రూ. 3 కోట్ల మేరకు ఖర్చవుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. స్థానిక ఎన్జీఓ కాలనీలో భారీ రాజమందిరాన్ని పోలిన పందిరి ఏర్పాటుకు రూ. 5 లక్షలు.. పూజాధికాలు, అన్నదానాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రసాదాలు, సత్కారాల కోసం శాలువలు, ఇతర ఖర్చులకు మొత్తం రూ.10 నుంచి 15 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

- చిన్నచౌకులో ఏర్పాటు చేయనున్న మరో భారీ పందిరికి రూ. 5–8 లక్షలకు పైగా ఖర్చు చేయనున్నారు.



గుంతకల్ ను

విగ్రహాలను గుంతకల్ నుంచి
గా వినాయక విగ్రహాల వ్యా
ఏడాది కొన్ని విగ్రహాలు మిగ
రాలు బాగా జరగాలని ఆశి
వ్యాపారి, కుమ్మరకొట్



సామాజిక స్ఫూర్తి..

వినాయక చవితి పండుగ సమయంలో వర్షాలు వస్తుంటాయి గనుక నీటిలో కొట్టుకువచ్చే మట్టితో చెరువులు పూడుకుపోతాయి. ఎక్కువ నీరు నిల్వ ఉండే అవకాశం ఉండదు కాబట్టి వచ్చిన నీరు పొర్లిపోయి వృథా కావడమే కాకుండా చెరువుకట్ట తెగే ప్రమాదం కూడా ఏర్పడుతుంది.
- గణపయ్య పండుగ సందర్భంగా చెరువు మట్టిని తవ్వుకొచ్చి వినాయకుని విగ్రహాలను తయారు చేసుకుంటారు. కాబట్టి పల్లెలోని ప్రజలంతా సామూహికంగా చెరువు పూడిక తీసినట్లువుతుంది. లోతు పెరగడంతో అందులో నీరు ఎక్కువగా నిల్వ ఉంటుంది. చెరువుకట్ట వద్ద మట్టి విగ్రహాలను నిమజ్జనం చేస్తారు గనుక ఆ మట్టి చెరువు కట్ట బలపడేందుకు ఉపయోగడుతుంది.

ఆరోగ్య భాగ్యం..

గణపతి గజముఖుడు. ఏనుగుకు వెలగపండ్లంటే ఇష్టం గనుక ఈ పండుగ పూజల్లో ఆ పండు తప్పనిసరి! పైటెంకను శరీరంతోనూ, అందులోని గుజ్జును జీవితంలో ఐశ్వర్యంతోనూ పోలుస్తారు. చెరుకులంటే ఏనుగుకు ఇష్టం. అందుకే వాటిని వాడతారు. మధురమైన మన జీవిత సారాన్ని పరులకు వినియోగించాలన్నదే దీని వెనుక సందేశం.

- పూజల్లో వాడే మొక్కజొన్న కంకులకు కూడా విశిష్టత ఉంది. ధాన్యం లభించేది కంకుల ద్వారానే! వాటిలో పెద్దగా ఉండేవి మొక్కజొన్న కంకులే! పైగా వీటిలో విశేష పోషకాహార విలువలున్నాయి. పూజల్లో వాడే తెల్ల జిల్లేడు పూలు ఔషధ గుణాలు కలవి. ఈ సీజన్‌లో వచ్చే ఎన్నో వ్యాధులకు ఇది నివారిణిగా ఉపయోగపడుతుంది.
- తంగేడు పూలు, వాటి కేశరాలు కూడా ఔషధ గుణాలు కలిగినవే! స్వామికి ఇష్టమైన కుడుములు సజ్జలతోనూ, ఉండ్రాళ్లను బియ్యంతోనూ చేస్తారు. ఈ ధాన్యమే సగటు మనిషికి ప్రధాన ఆహారం. అందుకే గణపతి పూజల్లో వీటిని నైవేద్యంగా సమర్పిస్తారు.









కం భక్తే..



మట్టి బొమ్మలు సిద్ధం

ఈనెల 25వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కడపకు మట్టి వినాయక విగ్రహాలను తీసుకొచ్చారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రతిమలను సిద్ధం చేస్తున్నారు. విగ్రహాలను పశ్చిమ బెంగాల్ ప్రాంతం నుంచి తెచ్చినట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. అయితే పీఓపీ విగ్రహాల కంటే కూడా మట్టి గణపతి విగ్రహాలు అందంగా కనిపిస్తున్నాయి. మంగళవారం సాయంత్రానికి కడప ఓం శాంతినగర్ ప్రాంతంలో మట్టి వినాయకులను తీసుకొచ్చి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. - సాక్షి, కడప

విగ్రహాలకు జీఎస్టీ సెగ

భారీగా పెరిగిన వినాయక విగ్రహాల ధరలు

ఎర్రగుంట్ల: వినాయక విగ్రహాలపై జీఎస్టీ సెగ తాకింది. ప్రతి ఏడాది వినాయక పండుగ వస్తుదంటే పది రోజులు ముందే పండుగ వాతావరణం గ్రామాలలో నెలకొంటుంది. ఈ ఏడాది విగ్రహాలకు జీఎస్టీ తోడవడంతో రేట్లు భారీగా పెరిగిపోయాయి. ఈ రేట్లను చూసి వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. అయినా తప్పని పరిస్థితులలో కొంటున్నారు.

- ఎర్రగుంట్ల పట్టణంలో వినాయక విగ్రహాల తయారీ ఈ ఏడాది చేపట్టారు. కొందరు కమిటీ నిర్వాహకులు పెద్ద సైజు విగ్రహాలు పెద్ద నగరాలకు పోయి తెచ్చుకుంటున్నారు. వినాయకుడు సైజు ను బట్టి రూ.100 నుంచి రూ.25 వేల వరకు అమ్ముతున్నారు.

గణనాథుల విగ్రహాలను తయారు చేయడానికి కావాల్సిన ముడిసరుకుపై జీఎస్టీ ప్రభావం పడింది. దీంతో విగ్రహాల రేట్లు 20 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగింది. చిన్న విగ్రహాలు కూడా రూ. వేలల్లో ధర పలుకుతున్నాయి. దీనికి తోడు విగ్రహాలను నిలబెట్టుకోవాలంటే అనుమతులు పేరుతో రూ.1500లు ఖర్చు వస్తోందని నిర్వహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఒక్కొక్క విగ్రహంను ఏర్పాటు చేసి దానికి ప్రత్యేక పందిర్లు, డెకరేషన్‌లు, నిమజ్జనం రోజు అన్నదానం, డప్పు వాయిద్యాలకు, బాణ సంచా.. ఇలా అన్ని కలిపి రూ.40 నుంచి రూ. లక్షలలో ఖర్చు వస్తుందని నిర్వాహకులు అంటున్నారు.

విద్యుత్ వాడకానికి రుసుం చెల్లించాలి

కడప అగ్రికల్చర్ : చవితి ఉత్సవాల నేపథ్యంలో వినాయక చవితి పందిళ్లు వేసి విగ్రహాలను నెలకొల్పేవారు తప్పని సరిగా నిర్ణీత ఫీజు చెల్లించి అనుమతులు పొందాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎం. శివప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం కడప లోని విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఈ మాట్లాడారు.

- ఉత్సవాలు నిర్వహించే కమిటీలు, వీధి పెద్దలు విగ్రహాల వద్ద లైటింగ్ కోసం విద్యుత్‌ను వాడుతున్నారని, ఆ విద్యుత్ వాడుకోవడానికి విద్యుత్‌శాఖ అనుమతులు తప్పని సరిగా ఉండాలన్నారు. విద్యుత్ వాడుకోవడానికి అందరికి దరఖాస్తు ఫీజు రూ.100లు అన్నారు.
- కడప పట్టణానికి సంబం ధించి చవితి నిర్వాహకులు మున్సి పల్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రంలో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మిగతా ప్రాంతాల్లోని వారు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు కార్యాలయాల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు.



పొద్దుటూరులో గణపయ్యకు తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

ముస్తాబయిన బొజ్జ గణపయ్య

ప్రొద్దుటూరు కల్చరల్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కుమ్మరికొట్టాల, మైదుకూరు రోడ్డు, సినీహబ్, హోమస్‌పేటలో వినాయక విగ్రహాలను విక్రయించే కేంద్రాలను ఏర్పాటు చేశారు. అడుగు నుంచి 13 అడుగుల దాక విగ్రహాలను వివిధ రూపాలతో కళాకారులు తీర్చిదిద్దారు. రూ. 1000 నుంచి రూ.25 వేల రూపాయల దాకా వీటిని విక్రయిస్తున్నారు. సింహ గణపతి, పార్వతీ పరమేశ్వర గణపతి, రాధాకృష్ణుల గణపతి, కృష్ణగణపతి తదితర రూపాలతో గణనాథున్ని సిద్ధం చేశారు.

- కొందరు వ్యాపారులు 5 నెలల ముందు నుంచి గుంతకల్, హైదరాబాదు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల నుంచి తయారీ దారులను రప్పించి వారితో విగ్రహాలను తయారు చేయించారు. మరికొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి గణపతి విగ్రహాలను తెప్పించి అమ్మకానికి ఉంచారు.
- గత ఏడాది కంటే ఈ ఏడాది విగ్రహాల ధరలు జీఎస్టీ ప్రభావంతో పెరిగాయి. ప్లాస్టర్ఆఫ్ ప్యారీస్, రంగులు, ఇనుప ఫ్రేమ్, చెక్కఫ్రేమ్, చెత్త తదితర ముడిసామగ్రి ధరలు పెరగడంతో పెద్ద విగ్రహాలపై రూ.1000 నుంచి 2500 రూపాయలు భక్తులు, ఉత్సవ కమిటీలపై అదనపు భారం పడుతోంది.
- దాదాపు 800 పైగా పెద్ద విగ్రహాలను విక్రయానికి ఉంచారు.

...ంచి తెప్పించాం..

...తెప్పిస్తున్నాం. 15 ఏళ్లు
...పారం చేస్తున్నాం. గత
...ాయి. ఈ ఏడాది వ్యాపా
...స్తున్నా. - ఉత్తమయ్య,
...ట్టాల, ప్రొద్దుటూరు.



ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేట్‌పరం చేయొద్దు

- ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలి
- సమ్మెలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేట్‌ పరం చేయరాదని, బ్యాంకు ఉద్యోగులపై కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను మానుకోవాలని సిండికేట్‌ బ్యాంకు ఎంప్లాయీస్‌ యూనియన్‌ అసిస్టెంట్‌ స్టేట్‌ సెక్రటరీ సి. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సెవెన్‌రోడ్స్‌ సిండికేట్‌ బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి ఎస్‌బీఐ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ యునైటెడ్‌ ఫోరం ఆఫ్‌ బ్యాంకు యూనియన్‌ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా సమ్మె చేపట్టినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాయడం తగదన్నారు. ప్రభుత్వం రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ, బ్యాంకుల విలీన ప్రక్రియను తక్షణం విరమించుకోవాలని డిమాండ్‌ చేశారు. బ్యాంకుల రుణాల రద్దు ఎగవేత దారులపై క్రిమినల్‌ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు అయ్యే ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కారుణ్య నియామకాలను చేపట్టి గ్రాట్యుటీ చట్టం పరిమితిని సవరించాలన్నారు. అన్ని ప్రభుత్వ బ్యాంకులో తగ్గిన సంఖ్యలో ఉద్యోగ నియమాకాలను చేపట్టి బ్యాంకుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ బ్యాంకులో ఖాతాదారులపై అనవసర చార్జీలను మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంకు ఎంప్లాయీస్‌ యూనియన్‌ నాయకులు సంజీవరెడ్డి, దస్తగిరి, ప్రసన్నకృష్ణ, గరుడయ్య, ఆంజనేయులు, మాలతి లావణ్య, లలిత పాల్గొన్నారు.

కోటీశ్వరుడికి రూ.కోటి డీకేటీ పట్టా

- కంచె వేయమని డబ్బులిస్తే పట్టా ఇచ్చేసిన అధికారి
- సుండుపల్లిలో వెలుగుచూసిన భూబాగోతం



సుండుపల్లి కూతవేటులో ఉన్న ఈ ప్రభుత్వస్థలం కోటీశ్వరులకు ధారాదత్తం

సాక్షి ప్రతినిధి, కడప/సుండుపల్లి: పేదలకు ఇంటి పట్టాలు మాత్రమే మంజూరుచేయాల్సిన రూ.కోటి విలువయ్యే ఎకరం భూమిని రెవెన్యూ అధికారులు ఒక కోటీశ్వరురాలికి డీకేటీ పట్టా ఇచ్చారు. సుండుపల్లి మండలకేంద్రంలో భవనాలు, వ్యాపారాలు ఉన్న ఆ వ్యక్తి కుటుంబం రూ.కోట్లకు పడగెత్తిందనే విషయం కళ్లెదుటే కనిపిస్తున్నా ఘనత వహించిన రెవెన్యూ అధికారులకు మాత్రం వారు నిరుపేదలుగానే కనిపించారు. ఎకరం భూమిని వ్యవసాయం చేసుకోమని ఉదారంగా డీకేటీ పట్టా మంజూరు చేసి ఆన్‌లైన్‌లో ఆ వ్యక్తి పేరు కూడా చేర్చారు. ఈ భూకుంభకోణానికి సంబంధించిన వివరాలు ఇవీ.. సుండుపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పశ్చిమభాగాన చాకలపల్లిరోడ్డు రహదారి పక్కనే సర్వే నంబరు 1592లో 1.34 ఎకరాల ప్రభుత్వభూమి ఉంది. ఈ భూమిని తమ పరం చేసుకోవాలని చాలాకాలంగా అనేకమంది పలుకుబడి కలిగిన వారు ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఈ భూమిలో తమకు ఇంటి పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు పేదలు దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక విలేకరులు మార్కెట్‌ ధరకు తమకు ఇంటి పట్టాలు అందించాలని విన్నవించుకున్నారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఈ భూమిలో పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు సిఫారసు చేశారు. అయితే మండలకేంద్రానికి నడిబొడ్డున ఉన్న ఈ భూమి ప్రభుత్వ భవిష్యత్‌ అవసరాలకు ఉపయోగపడుతుందనే ఆలోచనతో గతంలో పనిచేసిన ఆర్డీఓ వీరబ్రహ్మం ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు ప్రస్తుత ఆర్డీఓ చినరాముడు ఇటీవలే ఈ భూమిని పరిశీలించి 1.34 ఎకరాలు ప్రభుత్వ భూమి అని బోర్డు నాటించారు. చుట్టూ కంచె వేయించడానికి నిధులు కూడా మంజూరు చేయించారు. ఈ భూమిలో తమకు పట్టాలు మంజూరుచేయాలని తహసీల్దార్‌ సుబ్రమణ్యంరెడ్డి మీద తీవ్రమైన ఒత్తిడి రావడంతో ఆయన కొంతకాలం సెలవులో వెళ్లారు.

ఇంటిపట్టాలకు ప్రతిపాదన

సుండుపల్లిలో పనిచేస్తున్న పాత్రికేయులకు సర్వేనంబరు 2141లో 2011లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అప్పటి తహసీల్దార్‌ 2011లో ఇంటిపట్టాలు ఇచ్చారు. ఒక్క సెంటు భూమే పట్టా ఇవ్వడంతో ఇది ఎటూ చాలదని పట్టాలు తహసీల్దార్‌కు స్వాధీనం చేశారు. తమకు మరోచోట ఇంటి పట్టాలు మంజూరుచేయాలని కోరారు. కలెక్టర్‌గా పనిచేసిన రమణ, సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. మండలకేంద్రానికి సమీపంలో ఉన్న సర్వే నెంబరు 1592లో ఇంటిపట్టాలు ఇచ్చేందుకు అప్పటి ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ పరమేశ్వరస్వామి గతేడాది ఆగస్టులో కలెక్టర్‌కు నివేదిక పంపారు. పాత్రికేయులు మార్కెట్‌రేటుకు ఈ భూమిలో ఇంటి పట్టాలు అడిగారు.

నిబంధనలకు విరుద్ధంగా..

మండలకేంద్రానికి చుట్టుపక్కల 5కి.మీ.లోపు ప్రభుత్వభూమి ఉంటే ఇంటి పట్టా మాత్రమే ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం ఇందుకు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయి. ఇందుకు విరుద్ధంగా అప్పట్లో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన పరమేశ్వరస్వామి మండలకేంద్రానికి నడిబొడ్డున ఉన్న సర్వే నంబరు 1592లో ఒక ఎకరా భూమి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా షేక్‌.జబీవుల్లా భార్య షేక్‌ నజియా పేరుతో ఆన్‌లైన్‌లో చేర్చారు. ఈ వ్యవహారం గురించి ప్రస్తుత ఇన్‌చార్జి తహసీల్దార్‌ నారాయణరెడ్డిని వివరణకోరగా తాను 15 రోజుల కిందటే ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నాననీ, తనకు ఈ వివరాలు తెలియదని అన్నారు.

ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ కానిచ్చేశారు

తహసీల్దార్‌ సుబ్రమణ్యంరెడ్డి సెలవులో వెళ్లడంతో ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌గా వ్యవహరించిన ప్రస్తుత డిప్యూటీ తహసీల్దార్‌ పరమేశ్వరస్వామిని స్థానిక వ్యాపారి షేక్‌ జబీవుల్లా ప్రసన్నం చేసుకున్నారు. ఈ ఇద్దరి మధ్య డీల్‌ కుదరడంతో గతేడాది ఆగస్టులో గుట్టుచప్పుడు కాకుండా జబీవుల్లా భార్య నజియా పేరు మీద ఎకరం భూమికి డీకేటా పట్టా మంజూరు చేసినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ భూమికి నిబంధనలకు విరుద్ధంగా పట్టా మంజూరు చేసి ఇటీవలే ఆన్‌లైన్‌లో ఆమె పేరు ఎక్కించారు. ఈ వ్యవహారం వెనుక అధికార పార్టీకి చెందిన నాయకుల మద్దతు ఉండటంతో రెవెన్యూ అధికారులు కూడా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలంటే భయపడుతున్నారు.

ఆధారాలు ఉండటం వల్లే ఆన్‌లైన్‌లో చేర్చా

సర్వే నంబరు 1592లో ఒక ఎకరా భూమికి షేక్‌ నజియా పేరుతో పట్టా ఉండటం వల్లే ఆన్‌లైన్‌లో ఆమె పేరుతో చేర్చాం. ముడుపులు తీసుకుని ఆన్‌లైన్‌లో పేరు చేర్చామని వస్తున్న ఆరోపణలు వాస్తవం కాదు.

-డిప్యూటీ తహసీల్దార్‌ పరమేశ్వరస్వామి



మైదుకూరు మండలం కొత్త నెల్లూరు వద్ద సాగు చేసిన మలబారు వేపచెట్లు

మలబారు వేప సాగు

లాభదాయకం

- పెంపకం చాలా సులభం
- ఇంటి నిర్మాణ రంగానికి పనికొచ్చే కలప
- కలపకు డిమాండ్ ఎక్కువ

కడప అగ్రికల్చర్:

అతి త్వరగా పెరిగే వృక్షజాతుల్లో ఒకటి మలబారు వేప చెట్టు. ఈ మొక్కలు సాగు చేసిన ఆరున్నరేళ్ల తర్వాత మంచి ఆదాయం పొందవచ్చు. యూకలిప్టస్‌తో(జామాయిల్) పోలిస్తే ఉత్పత్తి చాలా అధికంగా ఉంటుంది.

మలబారు వేప ఇంటి నిర్మాణ రంగంలో బాగా పనికొస్తుంది. మైదుకూరు మండలం కొత్త నెల్లూరుకు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ పంటను సాగు చేశారు. ఈ పంట సాగు పద్ధతులు, దాని ఉపయోగాలను వివరిస్తున్నారు. 2013 జూలై నెలాఖరులో తమిళనాడు నుంచి నెల వయసు ఉన్న 320 మొక్కలు తీసుకొచ్చి ఎకరంలో నాటారు. ఇప్పుడు 36 ఇంచులు లావు తయారయ్యాయి. ఈ చెట్ల కలపకు గిరాకీ ఉంది. ఇంటి నిర్మాణంలో ఈ కలపను ఇప్పుడు చాలా రాష్ట్రాల్లో వాడుతున్నారు.

ఈ నేలలు అనుకూలం..

మలబారు వేప మొక్కలు సాగు చేయడానికి ఎర్రగరప నేల, నల్లరేగడి, రాతి నేలలు, ఇసుక నేల, ఎర్రచెల్క నేలలు, మొరం నేలలు బాగా అనుకూలం. ఇది చాలా మొండి మొక్క. అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుని త్వరగా పెరిగి మంచి చేవగల కలపను ఇస్తుంది. ఉష్ణోగ్రత 0 నుంచి 48 డిగ్రీల సెల్సియస్ వరకు తట్టుకోగలదు. సాధారణ వర్షపాతం 35 సెంటీ మీటర్ల నుంచి 100 సెంటీ మీటర్ల వరకు ఉన్న ప్రాంతాల్లో ఏపుగా పెరుగుతుంది. నీరు ఇంకే మంచి సారవంతమైన నేలల్లో నీటి వసతి ఉన్న భూముల్లో సాగు చేస్తే నెల నుంచి 1.5 అడుగులు పెరుగుతుంది. మంచి యాజమాన్య పద్ధతులతో పెంచిన మొక్కలు నెలకు రెండున్నర అడుగుల వరకు ఎత్తు పెరుగుతాయి.

సాగు పద్ధతులు..

మలబారు వేప భూసారాన్ని బట్టి, రైతు సామర్థ్యాన్ని బట్టి అధిక సాంద్ర పద్ధతి, పరిమిత, మిశ్రమ సాంద్రత పద్ధతుల్లో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. ఈ చెట్లకు పెద్దగా ఎరువులు వేయాల్సిన పనిలేదు. అంతర పంటలకు ఎటూ ఎరువులు వేస్తాం కాబట్టి అవే సరిపోతాయి. నేను మాత్రం పశువుల ఎరువును వేశాను. ఇప్పటికి అంతర పంటలు సాగు చేసే ప్రతిసారి పశువుల ఎరువును వేస్తున్నాను.

అధిక సాంద్ర పద్ధతి..

ఎకరాకు 700–800 మొక్కలు నాటుకుంటే ఆరున్నర సంవత్సరాల్లో 40 అడుగుల పైబడి ఎత్తు పెరిగి 3.5 నుంచి 4 అడుగుల చుట్టు కొలత కలిగిన స్థూపాకార కాండం ముదురు ఎరుపు కలిగిన కలప తయారవుతుంది. మంచి యాజమాన్య పద్ధతుల్లో నీటి వసతి కింద పెంచితే ఎకరానికి పది, పదిహేను సంవత్సరాల్లో రూ.10 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు.

పాక్షిక సాంద్ర పద్ధతి...

కష్టపడి వ్యవసాయ పంటలు పండించగల రైతులకు ఈ పద్ధతి అనుకూలం. అంతర పంటలు పండించుకుంటే ఎకరానికి 500 నుంచి 600 మలతబారు వేప మొక్కలు నాటుకోవచ్చు.

పరిమిత సాంద్ర పద్ధతి...

ఈ పద్ధతి చిన్న, సన్నకారు రైతులకు అత్యంత అనుకూలం. ఎకరానికి 250 నుంచి 320 మలబారు వేప మొక్కలు నాటుకుని పంట మార్పిడి కాలం పూర్తయ్యే వరకు అన్ని రకాల వ్యవసాయ పంటలు సాగు చేసుకునే వీలుంది. ఈ మొక్కలకు ఎలాంటి మందులు పిచికారీ చేయాల్సిన అవసరం ఉండదు.

పొలం గట్ల వెంట పెంపకం...

మలబారు వేప మొక్కలు 45 అడుగుల ఎత్తు పెరిగి తక్కువ కొమ్మలు కలిగిన ఆకారంలో పైకి పెరుగుతాయి. కనుక ప్రధాన పంటకు నీడ సమస్య కూడా ఉండదు. అధిక ఉష్ణోగ్రత నుంచి పంటలను కాపాడుతుంది. వేర్లు లోతుగా పోతున్నందున పోషకాలు, నీటి కోసం పోటీ ఉండదు. మలబారు వేప మొక్కలు అన్ని రకాల పండ్ల తోటల గట్ల మీద నిరభ్యంతరంగా నాటుకోవచ్చు.

అంతర పంటలు సాగు చేసుకోవచ్చు

మలబారు వేప మొక్కలను నాటినప్పటి నుంచి రెండు సంవత్సరాల వరకు అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. ఈ మొక్కల మధ్యలో అలసంద, మినుము, పెసరతోపాటు కూరగాయల పంటలను సాగు చేసుకోచ్చు.

ఉపయోగాలు ఇవే...

- ప్రపంచంలో అతి త్వరగా పెరిగే మొక్కల్లో ఒకటైనదిగా మలబారు వేప గుర్తింపు పొందింది.
- పక్షులకు ఆవాస యోగ్యాన్ని కల్గించి పంట పొలంలోని క్రిమి కీటకాల నివారణకు ఉపయోగపడతాయి.
- భూమి కోతకు గురవకుండా ఈ మొక్క బాగా ఉపయోగపడుతుంది.
- భూమిలోని సూక్ష్మజీవులను వృద్ధి చేసి భూమి సహజ స్వరూపాన్ని కాపాడుతుంది.
- కలప గృహ నిర్మాణాలకు అవసరమైన తలుపులు, కిటికీలు, కుర్చీలు, బెంచీలు ఇతర ఫర్నీచర్ తయారీకి వాడతారు.
- మలబారు వేప కలపకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

ఆరు ఇసుక లారీలు సీజ్

11 మంది డ్రైవర్లు, క్లీనర్లు అరెస్ట్



ఇసుకను తరలిస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లతో సీఐ, ఎస్‌ఐ

ప్రొద్దుటూరు క్రైం : జమ్మలమడుగు నుంచి వస్తున్న ఆరు ఇసుక లారీలను రూరల్ పోలీసులు సీజ్ చేశారు. ప్రొద్దుటూరు శివారులోని రైల్వేగేట్ సమీపంలో మంగళవారం ఉదయం లారీలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ వివరాలను సీఐ వెంకటశివారెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జమ్మలమడుగు మండలం, సుగమంచుపల్లె సమీపంలోని పెన్నా నది నుంచి ఆరు ఇసుక లారీలు వస్తున్నాయని సమాచారం రావడంతో రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో కలిసి ప్రొద్దుటూరు రైల్వే గేట్ సమీపంలో కాపు కాశారు. మంగళవారం వేకువ జామున ఇసుక నింపుకొని వస్తున్న ఆరు లారీలను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. బి.మఠంకు చెందిన శంకర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన నాగేంద్ర, వెలవలి పద్మనాభరెడ్డి, పోరుమామిళ్లలోని షేక్ అమీనలకు చెందిన లారీలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. లారీలను తీసుకొని వస్తున్న 11 మంది డ్రైవర్లు, క్లీనర్లను అరెస్ట్ చేసి, రిమాండుకు పంపిస్తున్నట్లు సీఐ తెలిపారు. లారీ యజమానులపై కూడా కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

అగస్తలింగాయపల్లె(కమలాపురం): మండల పరిధిలోని అగస్తలింగాయపల్లెకు చెందిన వీరంరెడ్డి వరలక్ష్మి (32) విద్యుదాఘాతంతో మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం వరలక్ష్మి నీరు పట్టు కోవడానికి సమీపంలో ఉన్న మోటారు వద్దకు వెళ్లింది. స్విచ్ వేసి నీరు పట్టుకోవడానికి పైపు పట్టుకోవడానికి బదులు మోటారుకు ఉన్న ఇనుప పైపు పట్టుకుంది. దీంతో ఆమె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. బి.మఠం మండలం లింగందిన్నెకు చెందిన వరలక్ష్మికి అగస్తలింగాయపల్లెకు చెందిన కృష్ణారెడ్డితో 15ఏళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు వైష్ణవి(14), తేజేశ్వర్‌రెడ్డి(10) పిల్లలున్నారు. ఆమె భర్త కృష్ణారెడ్డి 2012 మే 10వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. ఎస్‌ఐ మహమ్మద్ రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బస్సుపై దాడి కేసులో ఏడుగురు నిందితుల అరెస్ట్

కడప అర్బన్ : ఆర్టీసీ బస్సుపై ఈనెల 20 వతేదీ రాత్రి తమ మోటార్ సైకిల్‌పై వెంటపడి దాడికి పాల్పడిన ఏడుగురు నిందితులను మంగళవారం ఉదయం దేవుని కడప రోడ్డులో కడప టూటౌన్ ఎస్‌ఐ రుష్యేంద్ర బాబు తమ సిబ్బందితో అరెస్ట్ చేసినట్లు కడప డీఎస్పీ షేక్ మాసుం బాషా తెలిపారు. మంగళవారం కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కడప నగరం బెల్లంమండి వీధికి చెం దిన షేక్ యూనస్ అనే యువకుడు, తన స్నేహితుడు బీవీ రావు వీధికి చెం దిన వంశీ అనంత్ భట్‌తో కలిసి మద్యం సేవించి రాయల్ ఎన్ ఫీల్డ్ మోటార్ సైకిల్ (ఏపీ 04 బీహెచ్ 33 59)పై చక్కర్లు కొట్టారు. ఈ క్రమంలో రాత్రి 10:30 గంటల సమయంలో కడప నుంచి విజయవాడకు వెళ్లే ఆర్టీసీ బస్సు (ఏపీ 07 జెడ్0155)ను వెం టాడి బస్సు అద్దాలను పగులగొట్టే ప్రయత్నం చేశారు. వీరిద్దరికి తోడు మరో ఐదుగురు వచ్చి రాళ్లతో దాడి చేశారు. ఆర్టీసీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అరెస్టయి న వారిలో ప్రధాన నిందితులతో పాటు బెల్లం మండి వీధికి చెందిన ఎన్. చంద్రశేఖర్, సయ్యద్ తర్బేజ్ ఆలీ, కె. వినయ్ కుమార్ రెడ్డి, కె. సత్యారామ సాయి, డి.సతీష్ బాబులు ఉన్నారు. కడప అర్బన్ సీఐ దారెడ్డి భాస్కర్ రెడ్డి, టూటౌన్ ఎస్‌ఐ రుష్యేం ద్రబాబు పాల్గొన్నారు.



అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప డీఎస్పీ

16 మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్

రూ.3.5 లక్షలు విలువ గల దుంగలు స్వాధీనం



నిందితులు, దుంగలతో డీఎస్పీ, సిబ్బంది

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, బి. కోడూరు ప్రాంతాల్లో పోలీసులు దాడులు నిర్వహించి 16 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3.5 లక్షలు విలువ గల 16 ఎర్రచందనం దుంగలతో పాటు టాటా ఏస్ మ్యాజిక్ ఆటో, మోటార్‌బైక్, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇటీవల పలువురు జాతీయ, అంతర్జాతీయ స్మగ్లర్లను విచారించిన నేపథ్యంలో స్మగ్లర్ల సమాచారం తెలిసిందన్నారు. సోమవారం మోస్ట్ వాంటెడ్ అంతర్జాతీయ స్మగ్లర్లు శశికుమార్ (బెంగళూరు), గుద్దేటి రామనాథరెడ్డి (వింజమూరు)తో పాటు వారి అనుచరులు చలమచెర్ల శ్రీనివాసులు(రామేశ్వరం), నల్లు కృష్ణయ్య(పాణ్యం), చింపర్తి ఫకృవల్లి (ఖాదర్‌పల్లె) పట్టుబడ్డారన్నారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా షేక్ నాయబ్‌రసూల్, చెదమాల రత్తయ్య, ఆవుల పోలిరెడ్డి, సవరం వీరయ్య, సవరం కిట్టయ్య, మెగావత్ రామకృష్ణ నాయక్, పుల్లెడ మల్లేశ్వరుడు, రసూల్ బాషా, సవరం రమణయ్య, మహబూబ్‌బాషా, సురభి మహేష్, సవరం శ్రీనివాసులు, యాపరపల్లె అలీలను అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ వివరించారు.


పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

కలెక్టర్ బాబూరావునాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని పది పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బాబూరావునాయుడు తెలిపారు. మంగళవారం సాయంత్రం కొత్తకలెక్టరేట్‌లో భూ సేకరణ, ఆర్‌అండ్ ఆర్ సెంటర్లలో వసతుల కల్పనపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సుగమంచిపల్లె, శెట్టివారిపల్లె, గండ్లూరు, ఓబన్నపేట, పొన్నతోట, కలమల్ల, హనుమనగుత్తి, మేదరపేట, ముచ్చుమర్రి, కొర్రపాడు పునరావాస కేంద్రాల్లో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించామన్నారు. ఆర్ అండ్‌ఆర్ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. పునరావాస కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ, స్కూళ్లలో అదనపు గదుల ఏర్పాటు, భవనాలు, టాయిలెట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, డ్రైనేజీలు, రోడ్లు, ఉపాధి పనుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాయచోటి, కడప రోడ్డు విస్తరణకు భూసేకరణ పనులు, ఊటుకూరు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు, కడప–పులివెందుల రోడ్డు పనులు, ఖాజీపేట–కమలాపురం రోడ్డు పనులకు భూసేకరణ తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జేసీ శ్వేత తెవతీయ, స్పెషల్ కలెక్టర్ నాగేశ్వరరావు, చీఫ్ ఇంజనీరు వరదరాజులు, నేషనల్ హైవే ఈఈ ఓబుల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి, ఆర్డీఓలు చిన్నరాముడు, వీరబ్రహ్మయ్య, దేవేందర్‌రెడ్డి, ఇతరజిల్లా అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం దోష నివారణ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాహుకాల దోషం తమ కుటుంబాలపై పడకుండా చల్లగా చూడాలని కోరుతూ రాయలసీమ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు చేశారు.


విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

గ్రామీణ డాక్ సేవక్‌లకు కనీస వేతనం ఇవ్వాలి


పోస్టల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవక్‌లకు కేంద్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతనాలు అమలు చేసి వారి సంక్షేమానికి పాటుపడాలని గ్రామీణ డాక్ సేవక్ కడప డివిజన్ అధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16వ తేదీ నుంచి చేస్తున్న సమ్మె మంగళవారం ఏడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సేవక్‌లు పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2016 జనవరి నుంచి కనీస వేతనాలను అమలు చేయాలన్నారు. కమలేష్ కమిటీ ఆధారంగా వేతనాలు పెంచాలని కోరారు. ఇందులో భాగంగా కడప నగరంలో బుధవారం ర్యాలీ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఉద్యాన పథకాల అమలు వేగిరం చేయాలి


మాట్లాడుతున్న ఏడీ వెంకటేశ్వరరెడ్డి

కడప అగ్రికల్చర్ : కడప ఉద్యానశాఖ–1 పరిధిలో అమలవుతున్న పథకాలను వేగవంతం చేయాలని ఆ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ వెంకటేశ్వరరెడ్డి క్షేత్రస్థాయి ఉద్యోగులను ఆదేశించారు. మంగళవారం ఊటుకూరులోని ఉద్యాన శిక్షణ సంస్థ కార్యాలయంలో ఏడీ–1 పరిధిలోని ఎంపీఈలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఉద్యాన పంటలకు సంబంధించి మామిడిలో రీజెనేషన్, ఫాంపండ్స్ నిర్మాణాలు, ప్యాక్ హౌస్‌లు, పండ్ల తోటల సాగు ఏ మేరకు అయిందనే విషయాలను ట్యాబ్‌లో పొందు పరచాలన్నారు. పంటలకు తెగుళ్లు ఆశించినప్పుడు సలహాలు అందజేసి, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్ర ప్రిన్సిపల్ అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


వైస్ చాన్సలర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకులు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో కొన్ని కళాశాలలు నకిలీ డాక్యుమెంట్లతో గుర్తింపు పొందాయని.. వాటిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వైస్ చాన్సలర్ ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డిని కలిసి ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎం. నాగార్జున, వైవీయూ కన్వీనర్ భరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలలకు అఫిలియేషన్ ఇచ్చే క్రమంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని, వీటిపై విచారణ చేయిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. కళాశాలల్లో మౌలిక వసతులు, బిల్డింగ్, మైదానాలు లేకపోయినా గుర్తింపునివ్వడంతో విశ్వవిద్యాలయ ప్రతిష్ట దెబ్బతింటోందన్నారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మట్కా మహమ్మారి నిర్మూలనకు సహకరించాలి

- మట్కా రాసినా, ఆడినా కఠిన చర్యలు తప్పవు
- పోలీసు కళాజాగృతి బృంద ప్రదర్శనలో కడప డీఎస్పీ మాసుంబాషా


మాట్లాడుతున్న కడప డీఎస్పీ మాసుంబాషా

కడప అర్బన్ :

జిల్లా నుంచి మట్కా మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కడప డీఎస్పీ షేక్ మాసుం బాషా కోరారు. మంగళవారం రాత్రి స్థానిక మాచుపల్లె బస్టాండులో పోలీసు కళాజాగృతి బృందం మట్కా మహమ్మారిపై ప్రదర్శించిన నాటకానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కా చీటీలు రాసే బీటర్లు, మట్కా ఆడేవారు ఎవరూ బాగుపడలేదన్నారు. మట్కా వల్ల జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటు వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మట్కా వల్ల కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ ఆదేశాల మేరకు పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మట్కాలో భాగస్వాములుగా ఉంటే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో కళా జాగృతి బృందం ఎస్‌ఐ సిరాజుద్దీన్, అర్బన్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రుషేంద్రబాబు పాల్గొన్నారు.

మట్కా మహమ్మారిని పారదోలాలి: జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం మట్కా మహమ్మారిని పారదోలే దిశగా 'పరివర్తన' పేరుతో విస్తృత ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద కడప అర్బన్ సీఐ దారెడ్డి భాస్కర్ రెడ్డి, ఎస్‌ఐ ఎన్. రాజరాజేశ్వర్ రెడ్డి ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రయాణికులు ఎవరైనా మట్కా, స్లిప్‌ల పంపిణీ గురించి మాట్లాడినా, పంపిణీ చేస్తున్నా తమకు సమాచారం అందజేయాలని సూచించారు. మట్కా ఆడినా, రాసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆటోలకు 'పరివర్తన' స్టిక్కర్లను అతికించారు.

బుడగజంగం కాలనీ సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్ : కడప నగరం 48వ డివిజన్‌లోని బుడగజంగం కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ ప్రజలు కోరారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి పస్తం అంజి ఆధ్వర్యంలో వారు నగరపాలక సంస్థ కమిషనర్ పి. చంద్రమౌళీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ బుడగజంగం కాలనీలో కొద్దిపాటి వర్షమొచ్చినా రోడ్లన్నీ మురికినీటితో నిండిపోతున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురికినీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలను వ్యాప్తి చేస్తున్నాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో స్థానికులు లక్ష్మయ్య, శ్రీరాముడు, దస్తగిరి, సాయన్న ఉన్నారు.

నెలవారి పదోన్నతులను వెంటనే చేపట్టాలి


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఉపాధ్యాయ నేతలు

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్, తత్సమాన పోస్టుల నెలవారి పదోన్నతులను వెంటనే చేపట్టాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ఏపీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ బాబురావునాయుడుని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు నష్టం కలుగకుండా పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కేఎస్‌ఎం హిందీ భవన్ అధ్యక్షుడు కేఎస్ పర్షతుల్లా, హిందీ సేవాసదన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ సహదేవరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు ఎంఆర్ టీకాలు తప్పనిసరి

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని మోంటీఫోర్టు స్కూల్ విద్యార్థులకు మంగళవారం తట్టు, రుబెల్లా టీకాలను వేశారు. ఈ సందర్భంగా సీకే దిన్నె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, డీపీఎంఓ జాన్సన్, ప్రిన్సిపాల్ జోసెఫ్ మాట్లాడుతూ విద్యార్థులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు వేయించాల్సిన వారు 8500020199 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న తాహిర్, మిత్ర బృందం

కడప అర్బన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జన వికాస్ సేవా సమితి అధ్యక్షుడు తాహిర్ తెలిపారు. స్థానిక మారుతినగర్ ప్రాంతంలో ఆయన తన సహచరులతో కలిసి మొక్కులు నాటారు. కార్యక్రమంలో మైనార్టీ ప్రముఖుడు అబ్దుల్ వాజిద్, కామిశెట్టి హరీష్, శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం


కడప ఎడ్యుకేషన్ : ప్రముఖుల పెళ్లిరోజులు, పుట్టిన రోజులను పురస్కరించుకుని ప్రతి పాఠశాలల్లో అతిథి భోజనాన్ని ఏర్పాటు చేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎంఎస్‌ఏ డిప్యూటీ ఈఓ నాగముని రెడ్డి సూచించారు. కాగితాలపెంటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఈటీ టీచర్ రమేష్ తన పెళ్లిరోజును పురస్కరించుకుని విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండారు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

24న ప్రైవేటు విద్యాసంస్థల బంద్


సమావేశంలో మాట్లాడుతున్న ఇలియాస్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని ప్రైవేటు విద్యాసంస్థల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి కడపలోని ఆపూస్మ జిల్లా కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రామచంద్రారెడ్డి, ఎలియాస్‌రెడ్డి, బాలగంగయ్య, రమణారెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల్లో జరిగే చిన్నసమస్యలను కొన్ని సంఘాలు బూతద్దంలో చూపుతూ పాఠశాల ఆస్తులు, యాజమాన్యాలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కర్నూల్ జిల్లాలో ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్‌పై విద్యార్థి సంఘాల దాడికి నిరసనగా 24వ తేదీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేకస్‌బాబు, శివశంకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



రవి :నేనే రాజు..నేనేమంత్రి
ప్రతాప్ : ఆనందోబ్రహ్మ
రాజా (రహత్) : లై
మురళి : జయ జనాకి నాయక
సుధ : ఫిదా
తాహర్ : జనతా గ్యారేజ్
అమీర్ : అనబెల్
రమేష్ : గౌతమ్‌నంద
అప్సర : నిన్ను కోరి
ఎస్ఆర్ (సాయిబాబా) : లై

‘రెడ్ రివర్’ అని ఏ నదిని పిలుస్తారు?



ముల్కల రమేష్
సబ్జెక్టు నిపుణులు





మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పశ్చిమ కనుమల్లో జన్మించని నది ఏది?
1) గోదావరి 2) కృష్ణా
3) శరావతి 4) మహానది

2. కృష్ణానది ఏ ప్రాంతంలో సముద్రంలో కలుస్తుంది?
1) అంతర్వేది 2) దివిసీమ
3) హంసలదీవి 4) కృష్ణపట్నం

3. కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
1) కోసి నదిని ‘బిహార్ దుఃఖదాయని’ అని పిలుస్తారు
2) దామోదర్ నదిని ‘బెంగాల్ దుఃఖదాయని’ అని పిలుస్తారు
3) గండక్ నదిని ‘అసోం దుఃఖదాయని’ అని పిలుస్తారు
4) భారత్‌లో అతి పొడవైన నది గంగా

4. ప్రపంచంలో అతిపెద్ద డెల్టా అయిన ‘సుందరబన్స్ డెల్టా’ ఏ నదుల వల్ల ఏర్పడింది?
1) సింధూ, బ్రహ్మపుత్ర
2) బ్రహ్మపుత్ర, గంగా
3) సింధూ, గంగా
4) గంగా, యమున

5. కింది వాటిలో ఏ రెండు నదులు దాదాపుగా ఒకే ప్రాంతంలో జన్మిస్తాయి?
1) గంగా, సింధూ
2) గంగా, బ్రహ్మపుత్ర
3) బియాస్, తపతి
4) సింధూ, బ్రహ్మపుత్ర

6. కృష్ణానది జన్మస్థానం ఏది?
1) మానస సరోవరం
2) మహాబలేశ్వరం
3) త్రయంబకేశ్వర్
4) చిక్‌బల్లాపూర్

7. కింది వాటిలో ఉత్తరం వైపు ప్రవహించే నది ఏది?
1) కావేరి 2) నర్మద
3) చంబల్ 4) బ్రహ్మపుత్ర

8. కింది వాటిలో ఉత్తర భారతదేశం నుంచి దక్కన్ పీఠభూమిని విభజించే నది ఏది?
1) చంబల్ 2) కృష్ణా
3) గోదావరి 4) నర్మద

9. ‘జయమంగళి’ అనేది ఏ నదికి ఉపనది?
1) కృష్ణా 2) తుంగభద్ర
3) మంజీర 4) పెన్నా

10. అలక్‌నంద, భాగీరథి నదులు ఏ ప్రాంతంలో కలుస్తాయి?
1) దేవ ప్రయాగ 2) రుద్ర ప్రయాగ
3) రిషికేష్ 4) కరణ్ ప్రయాగ

11. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
1) కర్ణావతి 2) భాగీరథి
3) జమున 4) పద్మ

12. కింది వాటిలో గంగానది ఒడ్డున లేని నగరం ఏది?
1) వారణాసి 2) అలహాబాద్
3) కాన్పూర్ 4) లక్నో

13. జతపరచండి.
జాబితా-I
i) కుమవున్ హిమాలయాలు
ii) నేపాల్ హిమాలయాలు
iii) పంజాబ్ హిమాలయాలు
iv) అసోం హిమాలయాలు
జాబితా-II
a) ఇండస్, సట్లెజ్ మధ్య
b) కాళీ, తీస్తా మధ్య
c) తీస్తా, బ్రహ్మపుత్ర మధ్య
d) సట్లెజ్, కాళీ మధ్య
1) i-c, ii-d, iii-b, iv-a
2) i-c, ii-b, iii-d, iv-a
3) i-d, ii-b, iii-a, iv-c
4) i-d, ii-c, iii-a, iv-b

14. సాత్పురా, వింధ్య పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
1) నర్మద 2) గండక్
3) తపతి 4) గోదావరి

15. భారతదేశంలో బ్రహ్మపుత్ర నది మొదట ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది?
1) అసోం 2) త్రిపుర
3) సిక్కిం 4) అరుణాచల్‌ప్రదేశ్

16. కింది వాటిలో పశ్చిమం వైపు ప్రవహిస్తున్న నది ఏది?
1) గోదావరి 2) నర్మద
3) కావేరి 4) కృష్ణ

17. నదులు, వాటి జన్మస్థానాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
1) జీలం – వెరినాగ్
2) చీనాబ్ – బారాలప్చాలా
3) రావి – రోహతంగ్ కనుమ
4) సట్లెజ్ – రూపానగర్

18. బ్రహ్మపుత్ర నది భారతదేశంలో ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తుంది?
1) సిక్కిం, అసోం
2) అసోం, మేఘాలయ
3) అసోం, అరుణాచల్‌ప్రదేశ్
4) అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం

19. ‘రెడ్ రివర్’ అని ఏ నదిని పిలుస్తారు?
1) గంగా 2) కృష్ణా
3) కావేరి 4) బ్రహ్మపుత్ర

20. ‘భీమ’ దేనికి ఉపనది?
1) కృష్ణా 2) గోదావరి
3) నర్మద 4) కావేరి

21. గోదావరి నదికి మరో పేరు?
1) ఉత్తర గంగ 2) తూర్పు గంగ
3) దక్షిణ గంగ 4) పశ్చిమ గంగ

22. కింది వాటిలో బంగాళాఖాతంలో కలవని నది ఏది?
1) గోదావరి 2) కృష్ణా
3) తపతి 4) కావేరి

23. లక్నో నగరం ఏ నది ఒడ్డున ఉంది?
1) గోమతి 2) సట్లెజ్
3) గంగా 4) సరయు

24. బ్రహ్మపుత్ర నది పొడవు (సుమారుగా)?
1) 1900 కి.మీ. 2) 2900 కి.మీ.
3) 3900 కి.మీ. 4) 2800 కి.మీ.

25. కింది వాటిలో గోదావరి నది ఉపనది ఏది?
1) ఇంద్రావతి 2) స్వర్ణముఖి
3) చిత్రావతి 4) కుందేరు

26. కింది వాటిలో భారతదేశంలో జన్మించని నది ఏది?
1) బియాస్ 2) చీనాబ్
3) రావి 4) సట్లెజ్

27. జోగ్ జలపాతం ఏ నదిపై ఉంది?
1) తపతి 2) శరావతి
3) కావేరి 4) భీమ

28. వెంబనాడ్, లోక్‌తక్ సరస్సులు వరసగా ఏయే రాష్ట్రాల్లో ఉన్నాయి?
1) తమిళనాడు, రాజస్థాన్
2) కేరళ, మణిపూర్
3) కేరళ, ఒడిశా
4) ఒడిశా, రాజస్థాన్

29. ఆరావళి పర్వతాల్లో జన్మించి, కాంభే గల్ఫ్‌లోకి ప్రవహించే నది ఏది?
1) నేత్రావతి 2) లూని
3) సబర్మతి 4) తపతి

30. కింది వాటిలో ‘లూని’ నది దేనిలోకి ప్రవహిస్తుంది?
1) గంగాడెల్టా 2) కేరళతీరం
3) కచ్‌తీరం 4) గోదావరి డెల్టా

31. కింది వాటిలో చైనా, భారత్‌లో ప్రవహించే నది ఏది?
1) గంగ 2) యుమున
3) బ్రహ్మపుత్ర 4) దామోదర్ నది

32. శ్రీనగర్ ఏ నది ఒడ్డున ఉంది?
1) రావి 2) సట్లెజ్
3) జీలం 4) చీనాబ్

33. ‘లూనీ’ నది జన్మస్థానం ఏది?
1) సాంబార్ సరస్సు
2) అష్టముడి సరస్సు
3) లోనార్ సరస్సు
4) అన్నాసాగర్ సరస్సు

34. దేశంలోని నగరాలు, అవి ఉన్న నదీ తీరాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
1) అయోధ్య – సరయు
2) సూరత్ – తపతి
3) పనాజి – కావేరి
4) లుధియానా – సట్లెజ్

35. కావేరి నది ఏయే రాష్ట్రాల్లో ప్రవహిస్తోంది?
1) ఆంధ్రప్రదేశ్, తమిళనాడు
2) కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
3) ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర
4) కర్ణాటక, తమిళనాడు

36. అమరావతి నది ఏ నదికి ఉపనది?
1) కావేరి 2) కృష్ణా
3) పెన్నా 4) గోదావరి

37. కింది వాటిలో సరికానిది ఏది?
1) నర్మదా నది అమర్ కంటక్ వద్ద జన్మిస్తోంది
2) తపతి నది ముల్టాయి వద్ద జన్మిస్తోంది
3) తుంగభద్ర నది నందిదుర్గ కొండల్లో జన్మిస్తోంది
4) మహానది చత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని ‘శిహావా’ ప్రాంతంలో జన్మిస్తోంది

38. తోచి, గిల్గిట్, హుంజా అనేవి ఏ నదికి ఉపనదులు?
1) సింధూ 2) యమున
3) గంగ 4) బ్రహ్మపుత్ర

39. నాసిక్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
1) గోమతి 2) గోదావరి
3) నర్మద 4) తపతి

40. కింది వాటిలో ఏ నది ప్రఖ్యాతి చెందిన ‘మార్బుల్ ఫాల్స్’గా తయారవుతోంది?
1) నర్మద 2) తపతి
3) శరావతి 4) కావేరి

41. భారతదేశంలో ఏ నది వల్ల ఎక్కువగా వరదలు సంభవిస్తాయి?
1) గోదావరి 2) గోమతి
3) బ్రహ్మపుత్ర 4) కావేరి

42. కింది వాటిలో ఏ నదీతీరం అత్యధిక నీటి పరీవాహక ప్రాంతాన్ని కలిగి ఉంది?
1) గంగ 2) బ్రహపుత్ర
3) యమున 4) గోదావరి

43. కింది వాటిలో సరికానిది ఏది?
1) కోల్‌కతా – హుగ్లీ
2) మధురై – కావేరి
3) ఢిల్లీ – యమున
4) రూర్కెలా – బ్రహ్మణీ

44. అసోంలో ఏ నది వల్ల తీవ్ర వరదలు సంభవిస్తాయి?
1) గోమతి 2) గంగ
3) బ్రహ్మపుత్ర 4) యమున

45. బ్రహ్మపుత్ర నది జన్మస్థానం ఏది?
1) గంగోత్రి 2) పశ్చిమ కనుమలు
3) టిబెట్ పీఠభూమి
4) పూర్వాంచల్ పర్వతాలు

46. చిత్రావతి ఏ నదికి ఉపనది?
1) పెన్నా 2) గోదావరి
3) కృష్ణా 4) తుంగభద్ర

47. కెన్ నది జన్మస్థానం ఏది?
1) బండార్ పుంచ్ శిఖరం
2) జనపావో కొండలు
3) వరాహ పర్వతాలు
4) కైమూర్ కొండలు

48. కింది వాటిలో సరికానిది ఏది?
1) కెన్‌నదిని ‘కర్ణావతి’ అని పిలుస్తారు
2) వంశధార నదిని ‘లాంగుల్యా’ అని పిలుస్తారు
3) గండక్‌నదిని బిహార్‌లో ‘నారాయణి’ అని పిలుస్తారు
4) బ్రహ్మపుత్ర నదిని బంగ్లాదేశ్‌లో ‘జమున’ అని పిలుస్తారు

49. పూర్ణ, బేతుల్, పాట్కి అనేవి ఏ నదికి ఉపనదులు?
1) మహానది 2) పెన్నా
3) తపతి 4) నర్మద

50. ‘నాశ్’ సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
1) మహారాష్ట్ర 2) రాజస్థాన్
3) గుజరాత్ 4) జమ్ము-కశ్మీర్

51. కింది వాటిలో సరికానిది ఏది?
1) గౌహతి – బ్రహ్మపుత్ర
2) జంషెడ్‌పూర్ – సువర్ణరేఖ
3) శ్రీరంగపట్నం – పెన్నా నది
4) కటక్ – మహానది

52. బరాకర్, కోనార్ ఏ నదికి ఉపనదులు?
1) మహానది 2) దామోదర్
3) యమున 4) సబర్మతి

53. కింది వాటిలో ఏ నదిని ‘నేత్రావతి’ అని పిలుస్తారు?
1) బెట్వా 2) చంబల్
3) కోసి 4) యమున

54. చంబల్, బెట్వా, కెన్‌లు ఏ నదికి ఉపనదులు?
1) నర్మద 2) తపతి
3) యమున 4) దామోదర్

55. కింది వాటిలో పెన్నా నదికి ఉపనది కానిది ఏది?
1) కుందేరు 2) సిగిలేరు
3) లోకపావని 4) చెయ్యేరు

56. సోన్ నది గంగానదిలో ఎక్కడ కలుస్తుంది?
1) అలహాబాద్ 2) పాట్నా
3) రుద్ర ప్రయాగ 4) చాప్రా

57. నర్మదానది దేశంలో ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తోంది?
1) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
2) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్
3) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
4) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్

58. దిబాంగ్, లోహిత్ ఏ నదికి ఉపనదులు?
1) గంగా 2) సింధు
3) యమున 4) బ్రహ్మపుత్ర

59. గంగా నది ఏ రాష్ట్రంలో అత్యధిక దూరం ప్రవహిస్తోంది?
1) పశ్చిమ బెంగాల్
2) ఉత్తరప్రదేశ్ 3) బిహార్
4) ఉత్తరాఖండ్

60. కింది వాటిలో సరైంది ఏది?
1) దామోదర్ నది చోటానాగ్‌పూర్ పీఠభూమిలోని ‘టోరి’ అనే ప్రాంతంలో జన్మిస్తోంది
2) చంబల్ నది మధ్యప్రదేశ్‌లోని ‘మౌ’ అనే ప్రదేశంలో జన్మిస్తోంది
3) పెన్నా నది కర్ణాటకలో నంది దుర్గ కొండల్లో జన్మిస్తోంది
4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 4	2) 3	3) 3	4) 2	5) 4
6) 2	7) 3	8) 4	9) 4	10) 1
11) 4	12) 4	13) 3	14) 1	15) 4
16) 2	17) 4	18) 3	19) 4	20) 1
21) 3	22) 3	23) 1	24) 2	25) 1
26) 4	27) 2	28) 2	29) 3	30) 3
31) 3	32) 3	33) 4	34) 3	35) 4
36) 1	37) 3	38) 1	39) 2	40) 1
41) 3	42) 1	43) 2	44) 3	45) 3
46) 1	47) 4	48) 2	49) 3	50) 3
51) 3	52) 2	53) 1	54) 3	55) 3
56) 2	57) 3	58) 4	59) 2	60) 4

What is the percentage earning..



N. Vinaykumar Reddy
Director, IACE,
Hyderabad.

Model Questions

Directions (Q.No. 1 - 5) In each of these questions two equations are given. You have to solve these equations and give answer.

a) If $x < y$ b) If $x > y$
c) If $x = y$ d) If $x \geq y$
e) If $x \leq y$

1. I. $x(x + 7) = 30$
II. $y = \left(\frac{100}{9}\right)^{1/2}$

2. I. $3x^2 - 16x + 21 = 0$
II. $6y^2 + 25y + 21 = 0$

3. I. $2x^5(x^{-2}) = 128$
II. $\frac{1}{3}y^9 = \frac{1}{24}y^{11}$

4. I. $20x^2 - 108x + 144 = 0$
II. $25y^2 - 90y + 72 = 0$

5. I. $2x^2 + 18x + 36 = 0$
II. $y^2 - 3y - 18 = 0$

6. Ram sold an article with 2.5% loss. If he sold it 100/- more then Ram get 7.5% profit. What will be the selling price of article if Ram wants to earn 12.5% profit?
a) 1200 b) 1000
c) 1205 d) 1125
e) None of these

7. A takes 4 days to complete 1/3rd of a job. B takes 3 days to complete 1/6th of the same work and C takes 5 days to complete half of the job. If all of them work together for 3 days and A & C quit, how long will it take for B to complete the remaining work done?
a) 6 days b) 8.1 days
c) 5.1 days d) 7 days
e) None of these

8. Arun borrowed a sum of money from Jayant at the rate of 8% per annum simple interest for the first four years, 10% per annum for the next 6 years and 12% per annum for the period beyond 10 years. If he pays a total of Rs. 12160 as interest only at the end of 15 years, how much money





did he borrow?
a) Rs. 8000
b) Rs. 10000 c) Rs. 12000
d) Rs. 9000
e) None of these

9. Kalyani took a loan at simple interest rate of 6% in the first year with an increase of 0.5 % in each subsequent year. She paid interest of Rs. 3375 after 4 years. How much loan did she take?
a) Rs. 15000
b) Rs. 12500 c) Rs. 16000
d) Rs. 12000
e) None of these

10. Peter earned 50% more than sum of Ravi and Rajesh whereas Rajesh earnings are one third of that of Peter. What is the percentage earning of Ravi more than Rajesh?
a) 10% b) 15%
c) 50% d) 0%
e) 100%

11. In one litre of mixture of alcohol and water, water is 30%. The amount of alcohol that must be added to the mixture, so that the part of water in the mixture becomes 15%, is:
a) 1000 ml b) 700 ml
c) 300 ml d) 900 ml
e) None of these

12. A box contains 2 blue caps, 4 red caps, 5 green caps and 1 yellow cap. If one cap is picked at random, what is the probability that it is either blue or yellow?
a) $\frac{2}{9}$ b) $\frac{1}{4}$
c) $\frac{3}{8}$ d) $\frac{6}{11}$
e) None of these

13. A and B enter into a partnership with their capitals in the ratio 3 : 5. At the end of 4 months, A withdraws his capital. If they receive the profits in the ratio 4 : 5, find how long B's capital was used?
a) 2 months
b) 5 months c) 4 months
d) 3 months
e) None of these

14. The cost price of article B is 20% more than that of article A. Articles A and B were marked up by 50% and 25% respectively. Article A was sold at discount of 5% and article B was sold at a discount of 9%. If the selling price of article A was Rs. 30/- more than the selling price of article B, what was the cost price of article A?
a) Rs. 600/- b) Rs. 400/-
c) Rs. 500/- d) Rs. 540/-
e) None of these

Directions (Q. No. 15-19) : What should came in place of the question mark (?) in the following number series?

15. 6, 7, 16, 51, 208, ?, 6276
a) 1045 b) 941
c) 836 d) 1254
e) None of these

16. 3, 5, 8, 12, 17, ?, 30
a) 25 b) 27
c) 22 d) 24
e) None of these

17. 1, 8, 27, 64, ?, 216, 343
a) 145 b) 160
c) 125 d) 180
e) None of these

18. 4, 6, 12, ?, 90, 315, 1260
a) 42 b) 36
c) 24 d) 30
e) None of these

19. 18, 21, 16, 23, 12, 25, ?
a) 24 b) 8
c) 14 d) 10
e) None of these

Key & Solutions

1. I. $x^2 + 7x - 30 = 0$
$x^2 + 10x - 3x - 30 = 0$
$x(x + 10) - 3(x + 10) = 0$
$x = -10, 3$
II. $y = \sqrt{\frac{100}{9}} = \frac{10}{3} = 3.33$
Hence, $x < y$ ***Ans: a***

2. I. $3x^2 - 16x + 21 = 0$
$3x^2 - 9x - 7x + 21 = 0$
$(3x - 7)(x - 3) = 0$
$x = 3, \frac{7}{3}$
II. $6y^2 + 25y + 21 = 0$
$6y^2 + 18y + 7y + 21 = 0$
$y = -\frac{7}{6}, -3$
Hence, $x > y$ ***Ans: b***

3. I. $2x^5 (x^{-2}) = 128$
$2x^3 = 128$
$x = 4$
II. $y^9 = \frac{y^{11}}{8}$
$8 = y^2$
$y = 2\sqrt{2}$
Hence, $x > y$ ***Ans: b***

4. I. $20x^2 - 108x + 144 = 0$
$20x^2 - 60x - 48x + 144 = 0$
$20x (x - 3) - 48(x - 3) = 0$
$x = 3, 2.4$
II. $25y^2 - 90y + 72 = 0$
$25y^2 - 60y - 30y + 72 = 0$
$5y (5y - 12) - 6(5y - 12) = 0$
$y = 2.4, 1.2$
Hence, $x \geq y$ ***Ans: d***

5. I. $2x^2 + 18x + 36 = 0$
$x^2 + 9x + 18 = 0$
$x^2 + 6x + 3x + 18 = 0$
$x(x + 6) + 3(x + 6) = 0$
$x = -6, -3$
II. $y^2 - 3y - 18 = 0$
$y^2 - 6y + 3y - 18 = 0$
$y(y - 6) + 3(y - 6) = 0$
$y = 6, -3$
Hence, $x \leq y$
Ans: e

6. $\frac{107.5}{100}C - \frac{97.5}{100}C = 100$
∴ C = 1000
∴ Selling price
$= \frac{112.5}{100} \times C \Rightarrow \frac{112.5}{100} \times 1000 \Rightarrow 1125$
Ans: d

7. A ⇒ $\frac{1}{3}$ rd work in 4 days
A ⇒ total work in
3 × 4 = 12 days.
B ⇒ $\frac{1}{6}$th work in 3days
B ⇒ total work in
6 × 3= 18 days
C ⇒ half the work in 5 days
C ⇒ total work in
2 × 5 = 10 days
LCM of 12, 18, 10 is 180 units
A's 1 day's work = 15 units
B's 1 day's work = 10 units
C's 1 day's work = 18 units
A, B and C's 3 day's work = 3 (15 + 10 + 18) = 129 units
Remaining work = 180 – 129 = 51 units
B completes the remaining work in 5.1 days.
Ans: c

8. (4 years) (6 years) (5 years)
8 × 4 + 10 × 6 + 12 × 5
32 + 60 + 60 = 152%
152% ⇒ 12,160
Principle ⇒ 100%
$= 12160 \times \frac{100}{152} = 8000$ ***Ans: a***

9. Total interest % = 6 + 6.5 + 7 + 7.5 = 27%
∴ 27% ⇒ 3375
Principle ⇒ 100%
$= \frac{3375 \times 100}{27} = 12500$ ***Ans: b***

10. Peter $= \frac{150}{100}(\text{Ravi} + \text{Rajesh}) \rightarrow (1)$
Rajesh $= \frac{\text{Peter}}{3} \rightarrow (2)$
By substituting eq. (2) in (1)
3Rajesh = 1.5 Ravi +1.5 Rajesh
1.5 Ravi = 1.5 Rajesh
Ravi = Rajesh
Their earnings are equal.
Ans: d

11. In 1000 ml of mixture
Alcohol = 700 ml
Water = 300 ml
Let x ml of alcohol is mixed
According to question
$= \frac{300}{1000 + x} \times 100 = 15 \Rightarrow x = 1000\text{ml}$
Ans: a

12. 2B, 4R, 5G, 1Y
$P(B \text{ or } Y) = \frac{2C_1}{12C_1} + \frac{1C_1}{12C_1} = \frac{2}{12} + \frac{1}{12}$
$= \frac{3}{12} \Rightarrow \frac{1}{4}$ ***Ans: b***

13. A : B
3 × 4 : 5 × t
Profit ratio = $\frac{4}{5}$
$\Rightarrow \frac{12}{5t} = \frac{4}{5}$
t = 3 months ***Ans: d***

14. Let the cost price of article A = Rs. x
Cost price of article
$B = x \times \frac{120}{100} = \frac{6x}{5}$
Marked price of article
$A = x \times \frac{150}{100} = \frac{3x}{2}$
Marked price of article
$B = \frac{6x}{5} \times \frac{125}{100} \Rightarrow \frac{3x}{2}$
According to question,
$\frac{3x}{2} \times \frac{95}{100} - \frac{3x}{2} \times \frac{91}{100} = 30$
$\frac{3}{2}x \times \frac{4}{100} = 30$
∴ x = Rs.500/- ***Ans: c***

15. 6 7 16 51 208 **?=1045** 6276
(+1)×1 (+1)×2 (+1)×3 (+1)×4 (+1)×5 (+1)×6
∴ ? = (208 + 1) × 5 = 1045
Ans: a


16. 3 5 8 12 17 **? = 23** 30
+2 +3 +4 +5 +6 +7
∴ ? = 17 + 6 = 23 ***Ans: e***

17. 1 ⇒ 1^3, 8 ⇒ 2^3, 27 ⇒ 3^3,
64 ⇒ 4^3, ? = 5^3 ⇒ 125
216 ⇒ 6^3, 343 ⇒ 7^3
∴ ? = 5^3 = 125 ***Ans: c***

18. 4 6 12 **?=30** 90 315 1260
×1.5 ×2.0 ×2.5 ×3.0 ×3.5 ×4
∴ ? = 12 × 2.5 = 30
Ans: d

19. 18 21 16 **23** 12 25 ?=8
+3 -5 +7 –11 +13 –17
Here 3, 5, 7, 11, 13, 17 are prime numbers
∴ ? = 25 – 17= 8 ***Ans: b***

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





నాన్నా చెప్పవా?

ఒంటె పాలను తాగవచ్చా?



ఆవుల పాలకన్నా ఒంటె పాలు పుష్టిని, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. అందుకే ఒంటెలను పెంచే ప్రాంతాలలో చాలా మంది తమ పిల్లలకు ఒంటె పాలను తాగిస్తుంటారు. ఆవు పాలతో పోల్చినప్పుడు ఒంటె పాలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఒంటెలు ఎడారుల వంటి చాలా కఠోరమైన పరిసరాలలో జీవించే కారణంగా అవి తమ సంతానం కోసం అనేకవిధాలుగా మేలు చేసే పాలను ఉత్పత్తి చేసి అందిస్తాయి. ఆవుపాలు కేవలం 12 గంటలలోనే పులిసిపోతే ఒంటె పాలు మాత్రం రెండు రోజులపాటు (48 గంటలు) పాడవకుండా ఉంటాయి. రుచిలో ఆవుపాల కొంచెం ఉప్పగా ఉండే ఒంటె పాలు పోషకాల విషయంలో మాత్రం చాలా సుసంపన్నంగా ఉంటాయి. ఆవుపాలలోకన్నా ఒంటె పాలలో సి–విటమిను 3 రెట్లు ఎక్కువగాను, ఇనుము 10 రెట్లు ఎక్కువగాను ఉంటాయి. అదేవిధంగా ఆరోగ్యకరమైన ఆమ్లాలు బి–విటమిన్ కూడా ఒంటె పాలలో పుష్కలంగాఉంటాయి. వ్యాధి కారక సూక్ష్మజీవులకు, వైరస్‌లకు వ్యతిరేకంగా పని చేసే స్వభావం ఆవుపాలలోకన్నా ఒంటె పాలలో పది రెట్లు ఎక్కువగా ఉంటుంది. అయితే ఆవుపాలలో కొవ్వు శాతం 4.5% ఉంటే ఒంటె పాలలో అది కేవలం 2% మాత్రమే ఉంటుంది. ఇలా ఒక పక్క వివిధ పోషకాలను, విటమిన్లను పుష్కలంగా కలిగి ఉంటూ మరోపక్క హానికారకమైన కొవ్వులాంటి పదార్థాలు తక్కువగా ఉండే కారణంగా డయాబెటిస్, గుండె జబ్బులు వంటివి ఉన్న వారికి గతంలో పోషకాహార లోపంతో శరీరం క్షీణించిన వారికి, రోగ రోధక శక్తి తక్కువగా ఉండి అది పెంచుకోవలసిన అవసరం ఉన్న వారికి ఒంటెపాలు చాలా మంచివని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు. కొన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు ... జీర్ణకోశంలో వచ్చే గడ్డలు, ఇతర అపసవ్యతలు, జలుబు, క్షయ, ఉబ్బసం, రికెట్స్, హెపటైటిస్ వంటి పలు రుగ్మతలను నయం చేసుకునేందుకు ఒంటెపాలను ఓ చక్కటి ఔషధంలా వాడుకుంటారు.

మీకు తెలుసా?

మిడత వెనకకాళ్లను తరుచూ తడిమితే మనతో స్నేహం చేస్తుంది



బ్రిటన్‌లో 90% జనాభా వారంలో కనీసం ఒక్కసారైన పిజ్జా తింటారు



1939లో సంభవించిన ఒక్క ఉరుముతోనే 835 గొర్రెలు చనిపోయాయి




నీడలను గుర్తించండి

పైన కొన్ని బొమ్మలు ఉన్నాయి. కింద వేరు వేరు స్థానాల్లో వాటి నీడలు ఉన్నాయి. ఏ బొమ్మ నీడ దేనిదో గుర్తించి బొమ్మలతో వాటి నీడలను జతచేయండి.




లెక్కించండి.. రంగులు వేయండి

ఇక్కడ ఉన్న బొమ్మలో ఏవి ఎన్ని ఉన్నాయో లెక్కించి, కింద రంగులలో ఇచ్చిన బొమ్మల దగ్గర రాయండి. అన్నిటికీ కింద ఇచ్చిన మాదిరిగా రంగులు వేయండి.





కింద ఇచ్చిన ఏనుగు బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో

జిల్లా క్రీడాకారుల హవా

కడప స్పోర్ట్స్ : అనంతపురంలోని క్రీడాగ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–14 సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటుతున్నారు. సోమవారం ప్రారంభమైన టోర్నమెంట్‌లో తొలిరోజే కడప జట్టు కృష్ణాజట్టుపై 6–0 తేడాతో విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం నిర్వహించిన క్వార్టర్‌ఫైనల్‌లో కడప జట్టు తూర్పుగోదావరి జట్టుపై 6–1 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. దీంతో బుధవారం నిర్వహించే సెమీఫైనల్‌లో ఆతిథ్యజట్టు అనంతపురంతో తలపడనుంది. కాగా జిల్లా క్రీడాకారులు చక్కగా రాణిస్తుండటం పట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్‌హుస్సేన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డానియల్ ప్రదీప్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.



కడప-తూర్పుగోదావరి మధ్య నిర్వహిస్తున్న మ్యాచ్


వైవీయూలో అకడమిక్ కన్సల్టెంట్ నియామకాలు

28న ఇంటర్వ్యూలు

వైవీయూ : వైవీయూలో వివిధ విభాగాల్లో బోధించడానికి అకడమిక్ కన్సల్టెంట్ నియామకాలు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ ఆచార్య కె.సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు 28వ తేదీ ఉదయం ఒరిజినల్ సర్టిఫికెట్లు, పూర్తి బయోడేటాతో సంబంధిత విభాగాధిపతి లేక సమన్వయకర్తలను కలవాలని సూచించారు. పూర్తి వివరాలు, విభాగాల వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.యోగివేమనయూనివర్సిటీ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

వినాయక చవితికి ప్రత్యేక బస్సులు

కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ పరిధిలో వినాయక చవితిని పురస్కరించుకుని ఈనెల 24వ తేదీ రాత్రి నుంచి 50 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం కిశోర్ తెలిపారు. బెంగళూరు నుంచి 25, హైదరాబాద్ నుంచి 10, చెన్నై నుంచి 10, విజయవాడ నుంచి 5 బస్సులకు ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. అలాగే ఈనెల 25, 26, 27వ తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.



నేడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

తెలుగు కీర్తి 'ప్రకాశం'

కడప కల్చరల్‌ : ఆంధ్రకేసరి...ఆ పేరులోనే ఓ దర్పం...ఆయన వర్తనలో కూడా తెలుగు పౌరుషం.....నిరాడంబరం....నిజాయితీ....పట్టుదల....క్రమశిక్షణ...నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతవారినైన ఎదురించే గుణం, నచ్చని అంశంపై నిప్పులు కక్కే తత్వం, నిజాయితీకి నిలువెత్తు రూపం, తన గుండెను తుపాకీకి అడ్డుపెట్టి తెల్ల దొరలను సైతం తెల్లబోయేలా చేసిన సాహససింహం తెలుగు విలువల పతాకం ఆంధ్రక్రేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. నేడు ఆయన జయంతి. ఈ నేపథ్యంలో కడపతో ఆయనకు గల బంధం గురించి క్లుప్తంగా...

> రండిరా యీదె కాల్చుకొండిరాయని నిండు
> గుండెలిచ్చిన మహోద్దండ మూర్తి
> సరస్వమూ స్వరాజ్య సమర యజ్ఞము నందు
> హోమమ్మొనర్చిన సోమయాజి
>
> ప్రకాశం పంతులు గురించి ప్రముఖ కవి కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి అన్న మాట ఇది!

- ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి అంతగా తెలిసి ఉండకపోవచ్చు. కానీ, మొన్నటితరం నేత అయిన ఆయన పేరు వినగానే నిన్నటి తరానికి గర్వంతో గుండె ఉప్పొంగుతుంది. పలువురి పెద్దలు ఆయన గురించి తలుచుకుంటూ ఆయన అడుగు ఓ పిడుగు అని, మాట సింహ గర్జన అని, ప్రేమతో పలకరిస్తూ నవనీతం, ఆగ్రహిస్తే అగ్ని వర్షం అని అభివర్ణిస్తూ మురిసిపోతుంటారు.

కొన్నాళ్లు కడపలో...

- 1942లో క్విట్‌ ఇండియా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ప్రకాశం తన ఎత్తుగడలో భాగంగా కొన్నాళ్లు మన జిల్లాలో ఉన్నారు. అప్పటి మన జిల్లా నాయకులు కడప కోటిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, బసిరెడ్డి తదితరులతో కలిసి ఇక్కడే రాజకీయ మంతనాలు జరిపారు.
- బ్రిటీషు వారు కడపలోనే ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు.
- ప్రకాశం పంతులు శతజయంతి ఉత్సవాలను నిర్వహించిన సందర్భంగా కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో 1976 ఏప్రిల్‌ 20న ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాటి కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, స్థానిక నాయకులు పి.బసిరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు, నాటి కలెక్టర్‌ పీఎల్‌ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రకాశం జీవితం

- ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23వ తేదిన జన్మించారు. 1957 మే 20న కన్నుమూశారు. పేదరికంలో ఉన్న బాగా చదివి న్యాయవాదిగా పనిచేశారు. 1926లో సత్యాగ్రహం ఉద్యమంలోకి ప్రవేశించారు. 'స్వరాజ్య' దినపత్రికను స్థాపించారు.
- 1942లో క్విట్‌ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఆయనను తెల్లవారు కడపలో నిర్బంధించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉత్తమమైన పాలనను ప్రారంభించారు. 1972లో ఒంగోలు జిల్లాకు ఆయన పేరు ప్రకాశం జిల్లాగా మార్చారు. రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాకు ఒక నాయకుడి పేరు పెట్టడం ఆయనతోనే మొదలైంది. తెలుగుభాషను ఎంతగానో ప్రేమించే తెలుగుకు ప్రాచీన భాష హోదా దక్కడంలో చిక్కులు తొలగిన ఈ సంవత్సరంలోనే ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ ఉండడం విశేషం.

కడపలో...

కడప నగరంలో ఏడురోడ్ల కూడలిలో 1976లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ కూడలికి ప్రకాశం సర్కిల్‌గా నామకరణం చేశారు. ఆయనపై గౌరవంతో కడప నగరం దొంగల చెరువులోని ఓ ప్రాంతానికి ప్రకాశం నగర్‌గా పేరు పెట్టారు.

శ్రీ వినాయకం భజే..

కడప కల్చరల్‌ :

వినాయక చవితి పండుగ అంటే పిల్లలు, పెద్దలకు కూడా ఎంతో ఇష్టం. వినాయకుడిని కొని తెచ్చి వీధి కూడళ్లలో ప్రతిష్ఠించి, రోజంతా గణపయ్యను స్తుతిస్తూ ఆడి, పాడి, ప్రసాదాలు స్వీకరించి ఆనందంగా గడుపుతారు. తప్పులు మన్నించాలని గుంజీలు తీస్తారు. విద్యార్థులు పుస్తకాలను స్వామి వద్ద ఉంచి తమకు బాగా చదువు వచ్చేలా దీవించాలని కోరుతారు. అందరూ ఒక్కటై కార్యక్రమాల నిర్వహణకు పోటీలు పడతారు. నిజానికి వినాయక చవితి పండుగ అంటే కేవలం పూజలు, ప్రసాదాలు మాత్రమే కాకుండా దీని వెనుక ఎన్నో సామాజిక అంశాలు ఉన్నాయంటే ఆశ్చర్యమే కదా! అందులోనూ భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఈ పండుగ ఎంతో తోడ్పడిన విషయం కూడా పలువురికి తెలియదు. అసలు ఇళ్లలో మాత్రమే చేసుకునే వినాయక చవితి పూజలు, వీధి కూడళ్లలో నిర్వహించుకునేందుకు దారి తీసిన పరిణామాల గురించి సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

- వినాయక చవితి పండుగను పూర్వం ఇళ్లలో మాత్రమే నిర్వహించుకునే వారు. స్వాతంత్రోద్యమ సమయంలో లోకమాన్య బాలగంగాధర తిలక్‌ ప్రజలందరినీ ఒకేచోట కూడగట్టి స్వాతంత్ర్యం అవసరాన్ని గురించి వివరించి వారిలో పోరాట స్ఫూర్తి నెలకొనేందుకు ఊరిలోని ప్రధాన కూడలిలో ఓ మోస్తరు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే పద్ధతిని మొదలు పెట్టారు.
- మహారాష్ట్రలో ప్రారంభమైన ఈ పద్ధతిలో భాగంగా చుట్టుపక్కల వీధులకు చెందిన ప్రజలంతా ఆ పందిరి వద్దకు వచ్చి పూజలు చేసేవారు. ఆ తర్వాత స్వాతంత్ర్య ఉద్యమ పరిస్థితిని చర్చించుకుని చేపట్టాల్సిన కార్యాచరణ గురించి నిర్ణయం తీసుకునే వారు. బ్రిటీషు వారికి ఇది కంటగింపుగా మారింది. భారతీయుల్లో ఐక్యత పెరుగుతుందేమోనన్న భయంతో బహిరంగంగా చవితి పండుగ చేసుకోవడాన్ని నిషేధించారు.
- తిలక్‌ నాయకత్వంలో ఈ నిషేధాన్ని ధిక్కరించి ప్రజలు మరికొన్ని కూడళ్లలో పందిళ్లు వేసి పూజలు ప్రారంభించారు. చేసేది లేక బ్రిటీషు వారు మిన్నకుండిపోయారు. అప్పటి నుంచి బహిరంగ ప్రదేశాల్లో వినాయకుని విగ్రహాల ఏర్పాటు మొదలైంది.

పూజా పత్రి..

పండుగ రోజు వినాయకుడిని ప్రకృతిలో లభించే వివిధ రకాల ఆకులు, పూలతో పూజ చేస్తారు. పూజా పత్రి కోసం పిల్లలు చెట్లు, పొదలు గాలిస్తారు. పత్రి కోసం మొక్కల ఆకులను, చిగుర్లను తుంచడంతో మొక్కల కాండం బలపడుతుంది. సేకరించే పత్రిలో పలు ఔషధ గుణాలుంటాయి.

తాత్విక సందేశం..

వినాయక చవితి పండుగలో భాగంగా మట్టితో స్వామి బొమ్మను తయారు చేసి పూజించి మూడవరోజు నీటిలో నిమజ్జనం చేస్తారు. మనిషి దేవుడు చేసిన బొమ్మ అని, మధ్యలో అనుభవించే వైభవం శాశ్వితం కాదని, జీవితం మూడునాళ్ల ముచ్చటేనన్న తాత్విక సందేశాన్ని ఈ పండుగ మనకు తెలియజేస్తోంది.

విలక్షణ రూపం..

గణపయ్య బొమ్మను తయారు చేసేందుకు పిల్లలు ఎంతో ఆసక్తి చూపుతారు. ఏనుగు తలతో వినాయకుని రూపం విలక్షణంగా ఉండడమే వారి ఆసక్తికి కారణం. స్వామికి చేసే పూజల్లో ప్రతి అంశం రైతుల జీవితాలతో ముడిపడి ఉంటుంది. పూజా విధానం కూడా బాలల్లో ప్రకృతి పట్ల పరిశీలన పెంచేందుకు, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు తోడ్పడుతుంది.

- గణపతి శరీరంలో బొజ్జను ధాన్యాన్ని నిలువ ఉంచే 'గాదె'తో పోలుస్తారు. చెవులు గాదెలోని ధాన్యాన్ని చెరిగేందుకు ఉపయోగపడే చేటలుగా, చిన్న కళ్లు సూక్ష్మ దృష్టికి, నిశిత పరిశీలనకు ప్రతీకలుగా చెబుతారు.



సామాజిక స్ఫూర్తి..

వినాయక చవితి పండుగ సమయంలో వర్షాలు వస్తుంటాయి గనుక నీటిలో కొట్టుకువచ్చే మట్టితో చెరువులు పూడుకుపోతాయి. ఎక్కువ నీరు నిల్వ ఉండే అవకాశం ఉండదు కాబట్టి వచ్చిన నీరు పొర్లిపోయి వృథా కావడమే కాకుండా చెరువుకట్ట తెగే ప్రమాదం కూడా ఏర్పడుతుంది.

- గణపయ్య పండుగ సందర్భంగా చెరువు మట్టిని తవ్వుకొచ్చి వినాయకుని విగ్రహాలను తయారు చేసుకుంటారు. కాబట్టి పల్లెలోని ప్రజలంతా సామూహికంగా చెరువు పూడిక తీసినట్లువుతుంది. లోతు పెరగడంతో అందులో నీరు ఎక్కువగా నిల్వ ఉంటుంది. చెరువుకట్ట వద్ద మట్టి విగ్రహాలను నిమజ్జనం చేస్తారు గనుక ఆ మట్టి చెరువు కట్ట బలపడేందుకు ఉపయోగడుతుంది.

ఆరోగ్య భాగ్యం..

గణపతి గజముఖుడు. ఏనుగుకు వెలగపండ్లంటే ఇష్టం గనుక ఈ పండుగ పూజల్లో ఆ పండు తప్పనిసరి! పైటెంకను శరీరంతోనూ, అందులోని గుజ్జును జీవితంలో ఐశ్వర్యంతోనూ పోలుస్తారు. చెరుకులంటే ఏనుగుకు ఇష్టం. అందుకే వాటిని వాడతారు. మధురమైన మన జీవిత సారాన్ని పరులకు వినియోగించాలన్నదే దీని వెనుక సందేశం.

- పూజల్లో వాడే మొక్కజొన్న కంకులకు కూడా విశిష్ఠత ఉంది. ధాన్యం లభించేది కంకుల ద్వారానే! వాటిలో పెద్దగా ఉండేవి మొక్కజొన్న కంకులే! పైగా వీటిలో విశేష పోషకాహార విలువలున్నాయి. పూజల్లో వాడే తెల్ల జిల్లేడు పూలు ఔషధ గుణాలు కలవి. ఈ సీజన్‌లో వచ్చే ఎన్నో వ్యాధులకు ఇది నివారిణిగా ఉపయోగపడుతుంది.
- తంగేడు పూలు, వాటి కేశరాలు కూడా ఔషధ గుణాలు కలిగినవే! స్వామికి ఇష్టమైన కుడుములు సజ్జలతోనూ, ఉండ్రాళ్లను బియ్యంతోనూ చేస్తారు. ఈ ధాన్యమే సగటు మనిషికి ప్రధాన ఆహారం. అందుకే గణపతి పూజల్లో వీటిని నైవేద్యంగా సమర్పిస్తారు.





కడప నగరంలోని ఎన్జీ ఓ కాలనీలో భారీ సెట్టింగ్‌



కడప నగరంలోని చిన్నచౌకులో పందిరి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

డెకరేషన్‌కు భారీ ఖర్చు...

కడప కల్చరల్‌ : జిల్లా అంతటా వినాయక చవితి పండుగకు ఏర్పాట్లు జోరందుకున్నాయి. పలు పందిళ్లలో ఇప్పటికే భారీ సైజు గణపతి విగ్రహాలను కొలువుదీర్చారు. జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పందిళ్ల వద్ద పండుగకు దాదాపు రూ. 20 కోట్లను ఖర్చు చేయనున్నారు. కేవలం కడప నగరంలోనే దాదాపు రూ. 3 కోట్ల మేరకు ఖర్చవుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. స్థానిక ఎన్జీఓ కాలనీలో భారీ రాజమందిరాన్ని పోలిన పందిరి ఏర్పాటుకు రూ. 5 లక్షలు.. పూజాధికాలు, అన్నదానాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రసాదాలు, సత్కారాల కోసం శాలువలు, ఇతర ఖర్చులకు మొత్తం రూ.10 నుంచి 15 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

- చిన్నచౌకులో ఏర్పాటు చేయనున్న మరో భారీ పందిరికి రూ. 5–8 లక్షలకు పైగా ఖర్చు చేయనున్నారు.



పొద్దుటూరులో గణపయ్యకు తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం

గుంతకల్‌ నుంచి తెప్పించాం..



విగ్రహాలను గుంతకల్‌ నుంచి తెప్పిస్తున్నాం. 15 ఏళ్లుగా వినాయక విగ్రహాల వ్యాపారం చేస్తున్నాం. గత ఏడాది కొన్ని విగ్రహాలు మిగలాయి. ఈ ఏడాది వ్యాపారాలు బాగా జరగాలని ఆశిస్తున్నా. - ఉత్తమయ్య, వ్యాపారి, కుమ్మరకొట్టాల, ప్రొద్దుటూరు.

ముస్తాబయిన బొజ్జ గణపయ్య

ప్రొద్దుటూరు కల్చరల్‌: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కుమ్మరికొట్టాల, మైదుకూరు రోడ్డు, సినీహబ్, హోమస్‌పేటలో వినాయక విగ్రహాలను విక్రయించే కేంద్రాలను ఏర్పాటు చేశారు. అడుగు నుంచి 13 అడుగుల దాక విగ్రహాలను వివిధ రూపాలతో కళాకారులు తీర్చిదిద్దారు. రూ. 1000 నుంచి రూ.25 వేల రూపాయల దాకా వీటిని విక్రయిస్తున్నారు. సింహ గణపతి, పార్వతీ పరమేశ్వర గణపతి, రాధాకృష్ణుల గణపతి, కృష్ణగణపతి తదితర రూపాలతో గణనాథున్ని సిద్ధం చేశారు.

- కొందరు వ్యాపారులు 5 నెలల ముందు నుంచి గుంతకల్‌, హైదరాబాదు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల నుంచి తయారీదారులను రప్పించి వారితో విగ్రహాలను తయారు చేయించారు. మరికొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి గణపతి విగ్రహాలను తెప్పించి అమ్మకానికి ఉంచారు.
- గత ఏడాది కంటే ఈ ఏడాది విగ్రహాల ధరలు జీఎస్టీ ప్రభావంతో పెరిగాయి. ప్లాస్టర్‌ఆఫ్‌ ప్యారీస్‌, రంగులు, ఇనుప ఫ్రేమ్‌, చెక్కఫ్రేమ్‌, చెత్త తదితర ముడిసామగ్రి ధరలు పెరగడంతో పెద్ద విగ్రహాలపై రూ.1000 నుంచి 2500 రూపాయలు భక్తులు, ఉత్సవ కమిటీలపై అదనపు భారం పడుతోంది.
- దాదాపు 800 పైగా పెద్ద విగ్రహాలను విక్రయానికి ఉంచారు.

విద్యుత్‌ వాడకానికి రుసుం చెల్లించాలి

కడప అగ్రికల్చర్‌ : చవితి ఉత్సవాల నేపథ్యంలో వినాయక చవితి పందిళ్లు వేసి విగ్రహాలను నెలకొల్పేవారు తప్పని సరిగా నిర్ణీత ఫీజు చెల్లించి అనుమతులు పొందాలని జిల్లా విద్యుత్‌ శాఖ సూపరింటెండెంట్‌ ఇంజనీరు ఎం. శివప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం కడప లోని విద్యుత్‌ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఈ మాట్లాడారు.

- ఉత్సవాలు నిర్వహించే కమిటీలు, వీధి పెద్దలు విగ్రహాల వద్ద లైటింగ్‌ కోసం విద్యుత్‌ను వాడుతున్నారని, ఆ విద్యుత్‌ వాడుకోవడానికి విద్యుత్‌శాఖ అనుమతులు తప్పని సరిగా ఉండాలన్నారు. విద్యుత్‌ వాడుకోవడానికి అందరికి దరఖాస్తు ఫీజు రూ.100లు అన్నారు.
- కడప పట్టణానికి సంబంధించి చవితి నిర్వాహకులు మున్సిపల్‌ గ్రౌండ్‌ ఎదురుగా ఉన్న విద్యుత్‌ వినియోగదారుల సేవా కేంద్రంలో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మిగతా ప్రాంతాల్లోని వారు అసిస్టెంట్‌ డివిజనల్‌ ఇంజనీరు కార్యాలయాల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు.



మట్టి బొమ్మలు సిద్ధం

ఈనెల 25వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కడపకు మట్టి వినాయక విగ్రహాలను తీసుకొచ్చారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రతిమలను సిద్ధం చేస్తున్నారు. విగ్రహాలను పశ్చిమ బెంగాల్‌ ప్రాంతం నుంచి తెచ్చినట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. అయితే పీఓపీ విగ్రహాల కంటే కూడా మట్టి గణపతి విగ్రహాలు అందంగా కనిపిస్తున్నాయి. మంగళవారం సాయంత్రానికి కడప ఓం శాంతినగర్‌ ప్రాంతంలో మట్టి వినాయకులను తీసుకొచ్చి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. - సాక్షి, కడప

విగ్రహాలకు జీఎస్టీ సెగ

భారీగా పెరిగిన వినాయక విగ్రహాల ధరలు

ఎర్రగుంట్ల: వినాయక విగ్రహాలపై జీఎస్టీ సెగ తాకింది. ప్రతి ఏడాది వినాయక పండుగ వస్తుదంటే పది రోజులు ముందే పండుగ వాతావరణం గ్రామాలలో నెలకొంటుంది. ఈ ఏడాది విగ్రహాలకు జీఎస్టీ తోడవడంతో రేట్లు భారీగా పెరిగిపోయాయి. ఈ రేట్లను చూసి వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. అయినా తప్పని పరిస్థితులలో కొంటున్నారు.

- ఎర్రగుంట్ల పట్టణంలో వినాయక విగ్రహాల తయారీ ఈ ఏడాది చేపట్టారు. కొందరు కమిటీ నిర్వాహకులు పెద్ద సైజు విగ్రహాలు పెద్ద నగరాలకు పోయి తెచ్చుకుంటున్నారు. వినాయకుడు సైజు ను బట్టి రూ.100 నుంచి రూ.25 వేల వరకు అమ్ముతున్నారు. గణనాథుల విగ్రహాలను తయారు చేయడానికి కావాల్సిన ముడిసరుకుపై జీఎస్టీ ప్రభావం పడింది. దీంతో విగ్రహాల రేట్లు 20 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగింది. చిన్న విగ్రహాలు కూడా రూ. వేలల్లో ధర పలుకుతున్నాయి. దీనికి తోడు విగ్రహాలను నిలబెట్టుకోవాలంటే అనుమతులు పేరుతో రూ.1500లు ఖర్చు వస్తోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఒక్కొక్క విగ్రహంను ఏర్పాటు చేసి దానికి ప్రత్యేక పందిర్లు, డెకరేషన్‌లు, నిమజ్జనం రోజు అన్నదానం, డప్పు వాయిద్యాలకు, బాణ సంచా.. ఇలా అన్ని కలిపి రూ.40 నుంచి రూ. లక్షల లో ఖర్చు వస్తుందని నిర్వాహకులు అంటున్నారు.